# క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్
21-8-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 147

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




4లో

### ఆర్.డీ.ఓ. ఆదేశాలనూ పట్టించుకోని

# శేరిలింగంపల్లి తహసీల్దార్..?

## ఆర్టీఐ చట్టానికి తూట్లు పొడుస్తున్నారా..?

## ఆ సర్వే నంబర్‌పై ఎందుకంత మౌనం..?



రెవెన్యూ శాఖలో కీలకమైన భూ రికార్డుల విషయంలో అధికారుల తీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ గ్రామంలోని సర్వే నంబర్ 27/1కు సంబంధించిన భూ వ్యవహారంలో సమాచార హక్కు చట్టం కింద కోరిన సమాచారాన్ని పూర్తిగా, పాయింట్ వారీగా అందించడంలో జాప్యం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుదారు సమాచారం కోరగా, పూర్తిస్థాయి సమాచారం అందకపోవడంతో ఫస్ట్ అప్పీల్‌కు వెళ్లారు. అనంతరం ఆర్.డీ.ఓ. మరియు అప్పీల్ అథారిటీ సమక్షంలో విచారణ జరిగింది.

క్రైమ్ మిర్రర్, తెలంగాణ స్టేట్ బ్యూరో

# కొండా ఫ్యామిలీ రాజకీయ దూకుడు!

### ఆది నుంచి వారి వైఖరి అంతే

- పనిచేసే పార్టీ నాయకత్వాలపై తిరుగుబాటు
- గతంలో జగన్, కెసిఆర్ పై ఇదే మాదిరిగా
- కాంగ్రెస్ వేటు వేస్తే ఒంటరి
- చేర్చుకునేందుకు తెలంగాణలో పార్టీలు విముఖత

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :

తెలంగాణ రాజకీయాల్లో కొండా కుటుంబం స్టైల్ ప్రత్యేకం. ఆది నుంచి ఆ ఫ్యామిలీ దూకుడు వైఖరి ప్రదర్శిస్తూనే ఉంది. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం పైనే నేరుగా బహిరంగంగా తిరుగుబాటు బావుటా ఎగురవేయడం





2లో

# తెలంగాణలో జెన్ జీ!

### పతాక స్థాయికి విద్యార్థుల ఆందోళనలు

- పాలిటెక్నిక్ కళాశాలల విలీన ప్రక్రియపై భగ్గుమంటున్న యువత
- అణచివేత ధోరణిలో రేవంత్ సర్కార్

# టిడిపికి మరో గవర్నర్ పదవి!

- యనమల రామకృష్ణుడు లేదా ప్రతిభా భారతి
- ఇద్దరు సీనియర్ల పేర్లు పరిశీలిస్తున్న చంద్రబాబు
- ఇద్దరిలో ఒకరికి ఖాయం



# ఉండవల్లి అరుణ్ కుమార్‌కు షాక్!

- మార్గదర్శి కేసులో సంచలన తీర్పు
- పిటిషన్ ను కొట్టేసిన సర్వోన్నత న్యాయస్థానం
- ఉండవల్లి తీరుపై అసహనం



క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్: మాజీమంత్రి ఉండవల్లి అరుణ్ కుమార్ కు షాక్ తగిలింది. గత కొద్దిరోజులుగా ఆయన మార్గదర్శి చిట్ఫండ్ సమస్యలపై న్యాయపోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. దాదాపు రెండు దశాబ్దాలుగా ఆయన పోరాటం కొనసాగుతూ వచ్చింది.

2లో

# కేరళకు పవన్ కళ్యాణ్!

- 20 రోజులు పాటు అక్కడే
- రాజకీయ కార్యకలాపాలకు దూరం
- అనారోగ్య సమస్యలకు ప్రకృతి వైద్యం





## మోదీ, అమిత్ షాల రాజకీయ అధ్యాయం ముగిసింది

4లో


- ఎన్డీయేలో బీజేపీ ఆధిపత్యం క్షీణించిందన్న రాహుల్
- మోదీ, అమిత్ షా రాజకీయ ఆధిపత్యం తగ్గిందని వ్యాఖ్య
- కాంగ్రెస్, ఇండియా కూటమి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని

# 22ఏ సమస్యపై ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం..

- కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదు పరిష్కారమే లక్ష్యం
- ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదు
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం

22ఏ నిషేధిత భూముల అంశంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా రెవెన్యూ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసిందని కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును కేవలం ఒక ఫిర్యాదుగా కాకుండా ఒక బాధ్యతగా తీసుకోవాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి గారు స్పష్టం చేశారు.

నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. 22ఏ ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న కాల్స్, వాటి పరిష్కారం, ఏయే సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి, వచ్చిన కాల్స్‌కు ఎలాంటి సమాచారం అందిస్తున్నారు



# కొండా ఫ్యామిలీ రాజకీయ దూకుడు!

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ కాంగ్రెస్ లో పెనుముసలానికి దారితీసింది. పరకాల పర్యటనలో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవురి ప్రకాష్ రెడ్డిని మళ్లీ గెలిపించాలని సీఎం పిలుపునిచ్చిన వెంటనే.. కొండా సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ సీఎం రేవంత్ పై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. తల్లి ఒక రాష్ట్ర మంత్రి కాగా.. తండ్రి సీనియర్ నాయకుడు. వారి ఆశీస్సులు లేకుండా నేరుగా ముఖ్యమంత్రి పైనే తీవ్ర వ్యాఖ్యలు చేయడం అసాధ్యమని.. ఇదంతా కొండా దంపతుల వ్యూహాత్మక రాజకీయం అని విశ్లేషకులు భావిస్తున్నారు.

**పరకాలలో పట్టు కోసం..**

ఆది నుంచి పరకాలలో పట్టు బిగించాలన్నది కొండా ఫ్యామిలీ వ్యూహం. వచ్చే తరం రాజకీయ వారసత్వాన్ని కాపాడుకునే తాపత్రయంలో భాగంగానే ఈ కఠిన వైఖరి అని తెలుస్తోంది. గతంలో కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పిన మాట తప్పని ఆరోపిస్తూనే.. అదే పరకాల నుంచి తన కుమార్తెను రంగంలోకి దించాలని సురేఖతోపాటు భర్త మురళి కూడా ఆలోచన చేస్తున్నారు. కానీ సీఎం రేవంత్ మాత్రం రేవూరి ప్రకాష్ రెడ్డికి పరోక్ష మద్దతు తెలపడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నారు. సీఎం రేవంత్ తో పాటు హై కమాండ్ ను బెదిరించి తమ రాజకీయ డిమాండ్లు సాధించుకోవాలన్నదే కొండా ఫ్యామిలీ వ్యూహంగా తెలుస్తోంది.



**కాంగ్రెస్ పై అలిగితే అంతే**

అయితే కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కొండా ఫ్యామిలీకి దిక్కు. ఎందుకంటే దాదాపు అన్ని పార్టీలను చూసింది ఆ ఫ్యామిలీ. గతంలో పనిచేసిన పార్టీ నాయకత్వాలతో విభేదాలు కొనసాగుతున్నాయి. వైయస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేశారు కొండా సురేఖ, మురళీలు. ఆయనతో విభేదించి కెసిఆర్ పక్కన చేరారు. అక్కడ మంత్రి పదవి అనుభవించి అదే కేసీఆర్ పై తిరుగుబాటు చేశారు. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి అక్కడ మంత్రి పదవి పొందారు. ఇలా తరచూ పార్టీలు మారడం వారికి అలవాటు. క్రమశిక్షణ రాహిత్యంతో సొంత ప్రభుత్వాలతో పాటు పార్టీలపై తిరుగుబాటు చేస్తూ వచ్చారు. అందుకే వారి విషయంలో ఇతర పార్టీలు అంత అనుకూలంగా లేవు కూడా. తెలంగాణ సర్కార్లు మంత్రి పదవి నుంచి తొలగించి పార్టీ నుంచి వేటు వేస్తే కొండా ఫ్యామిలీ ఒంటరి కావడం ఖాయం.

**నాకు సంబంధం లేదు: మంత్రి సురేఖ**

మంత్రి సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్ హై కమాండ్ స్పందించింది. మంత్రి సురేఖకు నోటీసులు జారీ చేసింది. అయితే దీనిపై వివరణ ఇచ్చారు సురేఖ. కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగత అభిప్రాయా లేనని.. వాటితో పార్టీ పరంగా తనకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆమె మాట్లాడిన మాటలకు తనను బాధ్యురాలిని చేయడం సహజ న్యాయ సూత్రాలకు పూర్తిగా విరుద్ధమన్నారు. తాజాగా కొండా సురేఖ వివరణతో కాంగ్రెస్ పార్టీలో లోతైన చర్చ నడుస్తోంది.

# టిడిపికి మరో గవర్నర్ పదవి!



## సీనియర్ మోస్ట్ లీడర్..

యనమల రామకృష్ణుడు సుదీర్ఘకాలం తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ వచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపట్టారు. 1983లో తెలుగుదేశం పార్టీలో చేరిన ఆయన తుని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1999 వరకు గెలుస్తూనే ఉన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన ప్రతిసారి యనమల మంత్రి అయ్యారు. 1994లో మాత్రం స్పీకర్ అయ్యారు. 2014లో ఎమ్మెల్సీగా ఉన్న ఆయనకు మంత్రి పదవి ఇచ్చారు చంద్రబాబు. 2024లో ఎమ్మెల్సీగా ఉన్న ఆయన ఎటువంటి మంత్రి పదవి ఇవ్వలేదు. ఎమ్మెల్సీగా రెన్యువల్ లభించలేదు. ఆయన రాజ్యసభ పదవి ఆశిస్తున్నట్లు ప్రచారం నడిచింది. అయితే ఇప్పుడు అనూహ్యంగా ఆయన పేరును గవర్నర్ పోస్ట్ కు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. దేశవ్యాప్తంగా మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో గట్టి వ్యూహాలను అమలు చేస్తోంది. అందులో భాగంగా ఎన్డీఏ మిత్రపక్షాలతో మరింత బంధాన్ని పెంచుకోవాలని చూస్తోంది. అవసరం అనుకుంటే బలమైన ప్రాంతీయ పార్టీలను ఎన్డీఏలోకి తేవాలని చూస్తోంది. ఇంకోవైపు ప్రధాని నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటుతున్న తరుణంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ పై ప్రత్యేకంగా దృష్టి సారించింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలకు కేంద్ర మంత్రివర్గంలో పెద్దపీట వేయాలని చూస్తోంది. మరోవైపు కీలకమైన రాష్ట్రాలకు గవర్నర్ పోస్టులను సైతం నియమించాలని చూస్తోంది. వచ్చే ఏడాది దాదాపు పది మంది వరకు గవర్నర్ల పదవీ విరమణ జరగనుంది.. వారి స్థానంలో బిజెపి సీనియర్లను పంపించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. పనిలో పనిగా టిడిపి లాంటి మిత్రపక్షాలకు సైతం గవర్నర్ పోస్టులు కేటాయించాలని భావిస్తున్నట్లు సమాచారం.

**రాజ్యాంగబద్ధ పదవి..**

గవర్నర్ పోస్ట్ అనేది రాజ్యాంగబద్ధ పదవి. అందుకే దేశవ్యాప్తంగా బలమైన రాష్ట్రాలకు సొంత మనుషులను గవర్నర్లుగా నియమించుకోవాలని చూస్తోంది కేంద్రం. అందులో భాగంగా తెలుగుదేశం పార్టీకి ఒక గవర్నర్ పోస్ట్ ఇవ్వాలని సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. గతంలో పూసపాటి అశోక్ గజపతిరాజుకు గవర్నర్గా అవకాశము ఇచ్చింది కేంద్రం. ప్రస్తుతం ఆయన గోవా గవర్నర్గా పనిచేస్తున్నారు. వచ్చే ఏడాది ఖాళీ అవుతున్న పెద్ద రాష్ట్రానికి ఆయనను గవర్నర్గా పంపించే అవకాశం ఉంది. మరోవైపు మరో గవర్నర్ పోస్ట్ టిడిపికి కేటాయిస్తూ చంద్రబాబుకు కేంద్ర పెద్దలు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రముఖంగా ఇద్దరు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. పార్టీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు లేదా మహిళా నేత ప్రతిభ భారతికి అవకాశం ఇచ్చే పరిస్థితి ఉంది.

**మహిళా నేతగా గుర్తింపు..**

మరోవైపు తెలుగుదేశం పార్టీకి చెందిన సీనియర్ మహిళా నేత ప్రతిభా భారతికి సైతం గవర్నర్ పోస్ట్ దక్కే ఛాన్స్ కనిపిస్తోంది. సుదీర్ఘకాలం ఆమె తెలుగుదేశం పార్టీలో పని చేస్తూ వచ్చారు. 1983 నుంచి 1999 వరకు ఆమె శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన ప్రతిసారి ఆమెకు మంత్రి పదవి దక్కుతూ వచ్చింది. ఒకసారి మాత్రం అసెంబ్లీ స్పీకర్ అయ్యారు. తొలి మహిళా స్పీకర్ గా రాణించారు. పార్టీకి ఆమె చేసిన సేవలు, సీనియారిటీని గుర్తించి గవర్నర్గా ఆమె పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆ ఇద్దరు నేతల్లో ఒకరికి గవర్నర్ పోస్ట్ ఖాయమని తెలుస్తోంది.

# ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనండి

### కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం

### డిసెంబర్ 11 నుంచి 22 వరకు ఖేలో ఇండియా కార్యక్రమం

### కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయాను మంత్రి వాకిటి శ్రీహరి ఆహ్వానం

న్యూఢిల్లీ : తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు / క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ వీసీ / ఎండీ సోనిబాలాదేవి న్యూఢిల్లీలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాను కలిసి కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. తెలంగాణలో క్రీడా రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యువ క్రీడాకారులకు జాతీయ స్థాయిలో మెరుగైన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఖేలో ఇండియా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి తెలంగాణను దేశ క్రీడా పటంలో మరింత బలమైన రాష్ట్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ల్గ÷లో ఇండియా కార్యక్రమ నిర్వహణ కోసం తెలంగాణను ఎంపిక చేసినందుకుగాను మంత్రి వాకిటి శ్రీహరి కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు.

# తెలంగాణలో జెన్ జీ!

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో జెన్ జీ ఉద్యమాలు ప్రారంభం అయ్యాయి. యువత ఆందోళనలకు దిగుతున్నారు. దీంతో రేవంత్ సర్కార్ అప్రమత్తం అవుతోంది. తెలంగాణలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి చేర్చుతూ ప్రభుత్వం శక్తి స్కీం ప్రవేశపెట్టింది. జీవో 97 జారీ చేసింది. దీనిపై జెన్ జీ విద్యార్థి లోకం భగ్గుమంది. పలుచోట్ల పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. చాలాచోట్ల పోలీసులు లాఠీ చార్జ్ తో ఉద్రిక్తతలు ఏర్పడుతున్నాయి. తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలంటూ విద్యార్థులు ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు.

**ప్రభుత్వమే ఛాన్స్ ఇచ్చింది..**

అయితే ఈ విలీన ప్రక్రియతో ఈ ఉద్యమాలకు అవకాశం ఇచ్చింది తెలంగాణ సర్కార్. ఈ పాలిటెక్నిక్ కాలేజీల విలీన నిర్ణయం వల్ల దశాబ్దాలుగా కొనసాగుతున్న మూడు సంవత్సరాల సాంకేతిక విద్యా వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది అనేది విద్యార్థుల ఆందోళన. పాలిటెక్నిక్ డిప్లమో పూర్తి చేసిన తర్వాత ఈసెట్ ప్రవేశ పరీక్ష ద్వారా నేరుగా ఇంజనీరింగ్ లో ప్రవేశం ఉండేది. ఈ అవకాశాన్ని రద్దు చేయాలని ప్రభుత్వం చూస్తోంది అనేది విద్యార్థు నోటి నుంచి వస్తున్న మాట. సాంకేతిక విద్యను క్రమంగా నైపుణ్య శిక్షణ



ముసుగులో ప్రైవేటు సంస్థల పరం చేయడమే దీని ముఖ్య ఉద్దేశం అని వేలాదిమంది విద్యార్థులు ఆరోపిస్తున్నారు. విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

**సర్వత్రా ఉద్రిక్తత..**

రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు జరుగుతున్నాయి దీనిపై. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఎక్కడికక్కడే ఈ ఆందోళనలను అణచివేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. కొన్నిచోట్ల లాఠీ చార్జీలు జరిగాయి. తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థులకు, పోలీసులకు మధ్య జరిగిన తీవ్రతోపులాట, లాఠీ చార్జ్ ప్రయత్నాల్లో చాలామంది విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే ఈ పరిస్థితులు చూస్తుంటే తెలంగాణలో జెన్ జీ ఉద్యమం తీవ్రతరం అయ్యే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో...

# ఉండవల్లి అరుణ్ కుమార్‌కు షాక్!



అయితే సుప్రీంకోర్టు ఈరోజు ఇచ్చిన తీర్పుతో ఈ పోరాటానికి చెక్ పలికినట్లు అయింది. మార్గదర్శికి అనుకూలంగా తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఉండవల్లి అరుణ్ కుమార్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. దానిని అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ద్విసభ్య ధర్మాసనం ఈ కేసు పై తుది విచారణ జరిపి ఉండవల్లి పిటిషన్ ను డిస్మిస్ చేస్తూ కీలకతీర్పు వెల్లడించింది.

**ఉండవల్లి తీరుపై అసహనం..**

ఉండవల్లి అరుణ్ కుమార్ వేసిన పిటిషన్ పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఆయన తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. న్యాయమూర్తి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో పిటిషన్ వేయడానికి, పోరాటం చేయడానికి అసలు మీరు ఎవరు అని ప్రశ్నించింది. కేసు పూర్వాపరాలను పరిశీలిస్తే ఇది ప్రజా ప్రయోజనాల కోసం వేసిన పిటీషన్ కాదు అని.. మీ వ్యక్తిగత వివాదం లాగా మాత్రమే కనిపిస్తోంది అంటూ తీవ్రంగా వ్యాఖ్యానించింది. ఈ కేసులో మీరు వాదించే కొద్దీ మీపై అనుమానాలు మరింత పెరుగుతున్నాయంటూ సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

**బలమైన వాదనలు..**

మార్గదర్శి తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్ర, నాగ ముత్తు తమ బలమైన వాదనలు వినిపించ గలిగారు. కోర్టు ముందు ఉంచారు. మార్గదర్శి మొదటి నుంచి డిపాజిటర్ల ప్రయోజనాలకి పెద్దపీట వేసిందని.. ఇప్పటివరకు 2500 కోట్లకు పైగా మొత్తాన్ని డిపాజిటర్లకు విజయవంతంగా తిరిగి చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇంకా ఎవరైనా క్లైమ్ చేయని స్వల్ప మిగులు మొత్తం కేవలం 5.23 కోట్లు మాత్రమేనని.. నిబంధనల ప్రకారం ఖాతాల్లో భద్రపరిచిన విషయాన్ని కూడా న్యాయస్థానం ముందు ఉంచారు. తెలంగాణ హైకోర్టు పబ్లిక్ నోటీసులు జారీ చేసి అత్యంత పారదర్శకంగా ఈ ప్రక్రియ ముగించిన విషయాన్ని ప్రస్తావించారు. దీంతో న్యాయమూర్తులు ఉండవల్లి అరుణ్ కుమార్ తీరును అసహనం వ్యక్తం చేస్తూ ఈ తీర్పు చెప్పారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ చారిత్రాత్మక తీర్పుతో మార్గదర్శి సంస్థపై దశాబ్దాలుగా కొనసాగుతున్న ఉండవల్లి పోరాటానికి చెక్ పడినట్టే..

# కేరళకు పవన్ కళ్యాణ్!

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:**

**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. మొన్న ఆ మధ్యన ముంబైలో శస్త్ర చికిత్స కూడా చేసుకున్నారు. కొద్దిరోజుల విశ్రాంతి తర్వాత శాఖా పరమైన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇంతలోనే మరోసారి అస్వస్థతకు గురవుతూ ఇంటికి పరిమితం అయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్యం పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు.**

ఆయుర్వేద, ప్రకృతి వైద్య చికిత్స తీసుకున్నారు. ఇందుకుగాను పవన్ కళ్యాణ్ కేరళ పర్యటనకు వెళు _న్నారు. అక్కడ 20 రోజులపాటు ప్రత్యేక చికిత్స తీసుకోనున్నారు. వరుసగా పాలనా బాధ్యతలు, రాజకీయ పర్యటనలతో బిజీగా గడుపుతున్న ఆయన.. ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునే దిశగా వైద్యుల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

**తీవ్ర అనారోగ్య సమస్యలతో..**

గత కొంతకాలంగా పవన్ కళ్యాణ్ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. తీవ్రమైన పని ఒత్తిడి, వాతావరణ మార్పుల కారణంగా ఆయన వైరల్ ఫీవర్, స్పాండిలైటిస్, శ్వాసకోస సంబంధిత సమస్యల బారిన పడుతున్నారు. గతంలోనూ పలు పర్యటనలు, అధికారిక సమీక్షలు సైతం వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. తరచూ ఆయన క్యాబినెట్ సమావేశాలకు సైతం గైర్హాజరు కావాల్సి వచ్చింది. మొన్న స్వాతంత్ర దినోత్సవం నాడు ఆయన మరోసారి జ్వరం బారిన పడ్డారు. వెంటనే విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది.

**భుజం నొప్పితో..**

సినీ రంగం నుంచి రాజకీయాల్లో అడుగుపెట్టారు పవన్ కళ్యాణ్. విపరీతమైన క్రేజ్ తో ఆయన ఎక్కడికి వెళ్లినా అభిమానులు వెంటపడేవారు. ఈ క్రమంలోనే ఆయన భుజానికి సంబంధించి గాయం ఒకటి వెంటాడింది. ముంబైలో ప్రత్యేక చికిత్స కూడా తీసుకున్నారు. ఆపరేషన్ అనంతరం పూర్తిగా కోలుకోవడానికి.. వెన్నుతోపాటు కండరాల నొప్పుల నుంచి ఉపశమనం పొందడానికి సాంప్రదాయ కేరళ ఆయుర్వేద, ప్రకృతి వైద్య విధానం సరైన పరిష్కారమని నిపుణులు సూచించారు. ఈ క్రమంలోనే ఆయన కేరళలోని ప్రకృతి చికిత్స కేంద్రంలో చేరి సమగ్ర రికవరీ కోరుతున్న పూర్తి చేయాలని నిర్ణయించారు.

**అత్యవసర ఫైళ్లకు మాత్రమే..**

పవన్ కళ్యాణ్ కేరళలో పర్యటన నేపథ్యంలో.. 20 రోజులపాటు అందుబాటులో ఉండరు. పాలనాపరమైన అంశాలతో పాటు రాజకీయ భేటీలకు సైతం దూరంగా ఉండనున్నారు. అత్యవసర ఫైళ్ళకు సంబంధించి ఆన్లైన్ ద్వారా లేదా వ్యక్తిగత సిబ్బంది సహాయంతో పర్యవేక్షించనున్నట్లు సమాచారం. అయితే పవన్ కేరళ పర్యటన నేపథ్యంలో.. ముందస్తుగానే పార్టీ ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. స్థానిక ఎన్నికలపై దిశా నిర్దేశం చేశారు.

# రాజీవ్ బాటలోనే దేశాభివృద్ధి: డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి

**రామకృష్ణాపూర్ ఆగస్టు20(క్రైమ్ మిర్రర్):** భారతరత్న,మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ చూపిన ప్రగతి బాటలోనే దేశాభివృద్ధి, యువత వికాసం సాధ్యమవుతాయని మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో గల రాజీవ్ చౌక్ వద్ద కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



**సాంకేతిక విప్లవ ప్రదాత రాజీవ్ గాంధీ**

ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ.. యువతపై ఉన్న నమ్మకంతో రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయస్సును 18 ఏళ్లకు తగ్గించి దేశ రాజకీయాల్లో చారిత్రాత్మక మార్పు తీసుకొచ్చారన్నారు. గ్రామ స్వరాజ్య లక్ష్యంతో పంచాయతీ రాజ్ వ్యవస్థకు నేరుగా నిధులు అందజేసే విధానాన్ని అమలు చేశారని తెలిపారు. నేడు భారతదేశం గ్లోబల్ ఐటీ రంగంలో అగ్రగామిగా నిలవడానికి రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన కంప్యూటర్, టెలికాం విప్లవాలే ప్రాథమిక పునాదులని కొనియాడారు.

**రూ. 80 కోట్లతో క్యాతనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి**

చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణల నాయకత్వంలో నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతోందని రఘునాథ్ రెడ్డి తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో రూ. 80 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు వేగవంతం చేశామని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించామని వివరించారు.

**కార్మికుల సంక్షేమం - ఉపాధి కల్పన**

సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కొత్తగా ఓపెన్ కాస్ట్ గనులను ప్రారంభించడం ద్వారా స్థానిక యువతకు పెద్దపీట వేసి ఉపాధి అవకాశాలు పెంపొందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతిపక్షాలు చేస్తున్న నిరాధార విమర్శలను ప్రజలు తిప్పి కొట్టాలని కోరారు.

**సద్భావనా దివస్ - రాజీవ్ సేవలు చిరస్మరణీయం**

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ జయంతిని దేశవ్యాప్తంగా 'జాతీయ సద్భావనా దివస్'గా జరుపుకుంటామని, దేశ ఐక్యత, శాంతి, సాంకేతిక రంగాలలో విశేష కృషి చేసిన వారికి రూ. 10 లక్షల నగదు పురస్కారంతో కూడిన 'సద్భావన అవార్డు'ను అందించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. దేశంలో మౌలిక సదుపాయాల కల్పన, రహదారులు, విద్యుత్, ఎయిమ్స్ వంటి ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటు కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమయ్యాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు

# జన్మదిన వేడుకల్లో సేవా స్ఫూర్తి.. ఆలయాల అభివృద్ధికి రూ.12 లక్షల విరాళం

### కుమారుడు రాధాకృష్ణ జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం చేపట్టిన దశరథ్ నాయక్

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్):** కడ్తాల్ మాజీ జడ్పీటీసీ, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆడంబరాలకు దూరంగా జన్మదిన వేడుకలను నిర్వహిస్తూ, తన దివంగత కుమారుడు రాధాకృష్ణ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కడ్తాల్ మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మిస్తున్న దేవాలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులకు రూ. 12 లక్షల భారీ విరాళాన్ని అందజేశారు. కడ్తాల్ మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చేతుల మీదుగా ఈ విరాళాన్ని ఆలయాల ప్రతినిధులకు అందజేశారు. ఆలయాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు, పునర్నిర్మాణం తదితర కార్యక్రమాలకు ఈ నిధులను వినియోగించనున్నట్లు తెలిపారు.



**కుమారుడి జ్ఞాపకార్థం.. ఆధ్యాత్మిక సేవకు అంకితం**

తన దివంగత కుమారుడు రాధాకృష్ణ జ్ఞాపకాలను పదిలం చేస్తూ, ఆయన పేరిట ఏర్పాటు చేసిన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దశరథ్ నాయక్ నిరంతరం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తన జన్మదినాన్ని కూడా సేవా కార్యక్రమాలకు అంకితం చేయడం పట్ల పలువురు అభినందించారు. పుత్రశోకాన్ని గుండెల్లో దాచుకుని, రాధాకృష్ణ జ్ఞాపకాలను ప్రజాసేవతో ముడిపెట్టి ముందుకు సాగుతున్న దశరథ్ నాయక్, తన జన్మదినం సందర్భంగా ఆలయాల అభివృద్ధికి రూ. 12 లక్షలు విరాళంగా అందించడం ఆయన సేవా స్ఫూర్తికి, దైవభక్తికి నిదర్శనమని పలువురు పేర్కొన్నారు.

**ప్రముఖుల శుభాకాంక్షలు....**

దశరథ్ నాయక్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచే కడ్తాల్ మండల కేంద్రానికి అభిమానులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం తదితర ప్రముఖులు దశరథ్ నాయక్‌ను శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దశరథ్ నాయక్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని వారు ఆకాంక్షించారు.

**నియోజకవర్గ వ్యాప్తంగా ప్రశంసలు..**

జన్మదిన వేడుకలను కేవలం కేక్ కటింగ్, సన్మానాలకే పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాన్ని చేపట్టి, దేవాలయాల అభివృద్ధికి రూ. 12 లక్షల విరాళం అందించడం పట్ల భక్తులు, అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధులతో మండలంలోని పలు ఆలయాలకు మరింత పూర్వవైభవం తీసుకురావడానికి అవకాశం ఏర్పడుతుందని ఆలయ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు, మాజీ చైర్మన్లు, మాజీ ఎంపీపీలు, మాజీ వైస్ ఎంపీపీలు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఉపసర్పంచులు, టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, దశరథ్ నాయక్ అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# ఉపాధ్యాయుల కొరతను తీర్చండి

### బి జె వై ఎం మండల అధ్యక్షుడు నాంపల్లి సతీష్

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** మండల ప్రాథమిక పాఠశాల చిట్టెంపాడు గ్రామం లో అదనపు ఉపాధ్యాయుని ఏర్పాటు చేయాలని బి జె వై ఎం మండల అధ్యక్షుడు నాంపల్లి సతీష్ ఆధ్వర్యంలో నాంపల్లి మండలం విద్యాధికారి అజయ్ కుమార్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది. నాంపల్లి మండలం పరిధిలోని చిట్టెంపాడు గ్రామంలోని ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుండి ఐదు తరగతుల గాను 40 మంది విద్యార్థులు కలరు. ఇక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులు మాత్రం ఒక్కరే ఉన్నందున ఐదు తరగతి లకు ప్రతి సబ్జెక్టు బోధిస్తూ ఐదు తరగతుల విద్యార్థులకు నాణ్యమైన విద్యార్థులను అందించలేక అనేక ఇబ్బందుల గురవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం పాఠశాలలకు ఎంతో నమ్మకంతో తల్లిదండ్రులు విద్యార్థులను పంపిస్తే వారికి నాణ్యమైన విద్యను అందించలేకపోతున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మండల పరిధిలో ఎక్కువగా విద్యార్థులు లేని చోట అదనంగా వున్న ఉపాధ్యాయులను ఎంపీపీ ఎస్ చిట్టెంపాడు లో ఏర్పాటు చేయాలని మండల విద్యాధికారిని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి జె వై ఎం మండల ప్రధానకార్యదర్శి పొలగోని శ్రీకాంత్, మారేపాకుల శివ, సుంకరి శంకర్, నాంపల్లి శంకర్, నాంపల్లి శివ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు....

# సిగాచి బాధితులకు ప్రయోజనాలు వెంటనే అందించాలి

**13 నెలలైనా పరిష్కారం కాని క్లెయిమ్‌లు**

**13 మంది ఈపీఎఫ్ క్లెయిమ్‌లు పెండింగ్**

**రాజేష్‌కు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి**

**బాధిత కుటుంబాలకు తక్షణ సాయం అందించాలి**



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 20: సిగాచి ఇండస్ట్రీస్ ప్రమాదం జరిగి 13 నెలలు గడిచినా పలువురు బాధిత కుటుంబాలకు ఈపీఎఫ్, ఈడీఎల్ఐ, ఈఎస్ఐ ప్రయోజనాలు అందలేదని టీపీజేఏసీ సంగారెడ్డి జిల్లా కమిటీ పేర్కొంది. పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించి బాధితులకు చట్టబద్ధమైన ప్రయోజనాలు అందించాలని డిమాండ్ చేసింది. టీపీజేఏసీ ప్రతినిధులు పటాన్‌చెరు ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసీ కార్యాలయాలను సందర్శించి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈపీఎఫ్, ఈడీఎల్ఐ ప్రయోజనాలు పెండింగ్‌లో ఉన్న 13 మంది బాధితుల జాబితాను ఈపీఎఫ్ఓ అధికారులకు, ఈఎస్ఐ ప్రయోజనాలు పెండింగ్‌లో ఉన్న 25 మంది బాధితుల జాబితాను ఈఎస్ఐసీ అధికారులకు అందించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజేష్ కుమార్ చౌదరికి కంపెనీ మెరుగైన వైద్యం అందించడంతో పాటు రూ. 50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని టీపీజేఏసీ జిల్లా కన్వీనర్ వై. అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున పెండింగ్ క్లెయిమ్‌లను అత్యవసరంగా పరిష్కరించి, అర్హులైన వారికి ఈపీఎఫ్, ఈడీఎల్ఐ, ఈఎస్ఐ ప్రయోజనాలు తక్షణమే అందించాలని టీపీజేఏసీ కోరింది. కార్యక్రమంలో శ్రీధర్ మహేంద్ర, ఆర్. లక్ష్మి, ఏ. మానస పాల్గొన్నారు.

## రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రిలో

# అరుదైన శస్త్రచికిత్స

### మహిళ కడుపులో 2 కేజీల భారీ గడ్డ తొలగింపు







**రామకృష్ణాపూర్, ఆగస్టు20 (క్రైమ్ మిర్రర్):** స్థానిక సింగరేణి ఏరియా ఆస్పత్రి వైద్యులు మరో అరుదైన క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి తమ ప్రత్యేకతను చాటుకున్నారు. తీవ్రమైన పొత్తికడుపు నొప్పితో ఆస్పత్రికి వచ్చిన 39 ఏళ్ల మహిళకు పరీక్షలు నిర్వహించగా, పొత్తికడుపు మరియు పెల్విక్ ప్రాంతంలో సుమారు 16.5 x 16.7 సెం.మీ. పరిమాణంలో ఉన్న 2 కేజీల భారీ గడ్డ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. రోగి ప్రాణాపాయ స్థితిని గుర్తించిన గైనకాలజిస్టులు డాక్టర్ హరిత, డాక్టర్ లలిత, అనస్థీషియన్ డాక్టర్ మధుకర్ బృందం ఆగస్టు 14న 'ఎక్స్‌ప్లోరేటరీ లాపరోటమీ' పద్ధతిలో శస్త్రచికిత్స చేపట్టింది. అత్యంత జాగ్రత్తగా శ్రమించి, కడుపులోని భారీ గడ్డను సురక్షితంగా తొలగించారు. చికిత్స అనంతరం నిరంతర పర్యవేక్షణలో రోగి పూర్తిగా కోలుకోవడంతో గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.


**సిబ్బందికి అభినందనలు**

ఈ శస్త్రచికిత్స విజయవంతం కావడంలో జీఎం రాధాకృష్ణ, సీఎంఓ కిరణ్ రాజ్ అందించిన మార్గదర్శనం, డిప్యూటీ సీఎంఓ (అడ్మిన్) డాక్టర్ ఎం. మధు కుమార్ ప్రత్యేక కృషి అభినందనీయమని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అధునాతన వైద్య పరికరాలు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్, మ్యాట్రన్ మరియు నర్సింగ్ సిబ్బంది సమన్వయంతోనే ఇది సాధ్యపడిందని కొనియాడారు.

**ఆస్పత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలి**

గతంలోనూ తమ ఆస్పత్రిలో మోకాలు మార్పిడి, తుంటి మార్పిడి వంటి క్లిష్ట మైన ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించినట్లు డిప్యూటీ సీఎంఓ డాక్టర్ ఎం. మధు కుమార్ తెలిపారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు కంపెనీ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య సేవలు, సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బీసీ మహిళలకు 100% సబ్సిడీతో ఉచిత కుట్టు మిషన్లు దరఖాస్తుల ఆహ్వానం



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ - నాగర్‌కర్నూల్ జిల్లా
తేది: 20-08-2026
పత్రికా ప్రకటన
బీసీ మహిళలకు 100% సబ్సిడీతో ఉచిత ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ - దరఖాస్తుల ఆహ్వానం
ముఖ్యమైన తేదీలు:
✓ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం: 15 ఆగస్టు 2026
✓ దరఖాస్తులకు చివరి తేది: 15 సెప్టెంబర్ 2026
Dist. B.C. Development Officer
నాగర్‌కర్నూల్ జిల్లా.
Add to note

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్‌కర్నూల్):** రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల (బీసీ) మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధిని ప్రోత్సహించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం "ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం 2026-27"ను ప్రారంభించింది. తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈ పథకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 1,000 యూనిట్ల చొప్పున అర్హులైన బీసీ మహిళలకు 100% సబ్సిడీతో (పూర్తిగా ఉచితంగా) ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నారు. 15 ఆగస్టు 2026 నుంచి 15 సెప్టెంబర్ 2026 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన బీసీ మహిళలు అధికారిక వెబ్‌సైట్ https://tgobmms.cgg.gov.in ద్వారా గానీ, సమీపంలోని మీసేవ లేదా ఇంటర్నెట్ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ బీసీ మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అధికారులు కోరారు.



# 22ఏ సమస్యపై ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం..

(మొదటి పేజీ తరువాయి)

తదితర అంశాలపై బుధవారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు సమీక్షించారు. నాలుగు జిల్లాల్లో 22ఏ అంశంపై ప్రస్తుత పరిస్థితి, దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు ఈ సందర్భంగా అధికారులు మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా, దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్ తదితర అధికారులకు పంపించాలని ఆదేశించారు. ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఘాల్ సెంటర్ నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు స్వీకరించిన అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదుపై నిజానిజాలను నిర్ధారించి, దరఖాస్తుదారు పేర్కొన్న సమస్య వాస్తవమా? భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు వచ్చింది? దరఖాస్తుదారుడికి అర్హత ఉందా? అనే అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. పరిశీలన అనంతరం స్పష్టమైన కారణాలతో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యను చెప్పిన తర్వాత పరిష్కారం కోసం మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఇప్పటికే సబ్‌రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్ల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు, గడచిన రెండు మూడు రోజుల్లో కొత్తగా వచ్చిన దరఖాస్తులను కూడా వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఇకపై కొత్తగా వచ్చే దరఖాస్తులు పెండింగ్‌లో పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. 2ఏ సమస్య పరిష్కారాన్ని ప్రత్యేక టాస్క్‌గా తీసుకుని అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి తన సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకంతో బయటకు వెళ్లాలి. వచ్చిన దరఖాస్తును మరో కార్యాలయానికి పంపించి చేతులు దులుపుకోకండి. చివరి వరకు పర్యవేక్షించండి. మీ పనితీరుతో ప్రజల అభిమానాన్ని చూరగొనండి' అని అధికారులకు సూచించారు. అధికారులు సొంత నిర్ణయాలతో ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదని, ప్రభుత్వ ఆలోచనలు, విధానాలకు అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

# మోదీ, అమిత్ షాల రాజకీయ అధ్యాయం ముగిసింది

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై మరోసారి విమర్శలు గుప్పించారు. ఎన్డీయేలో బీజేపీ రాజకీయ ఆధిపత్యం క్షీణించిందని... మోదీ, అమిత్ షా రాజకీయ ప్రయాణం ముగిసిపోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో బీజేపీకి స్వతంత్రంగా మెజారిటీ లేకపోవడం వల్ల ఆ పార్టీ రాజకీయ శక్తి, పట్టు పూర్తిగా తగ్గిపోయాయని ఆయన విమర్శించారు. గతంలో చూపిన రాజకీయ ఆధిపత్యాన్ని మోదీ, అమిత్ షా జోడీ ఇప్పుడు కోల్పోయిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ, 'ఇండియా' కూటమి మరింత వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలపై పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని, రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# రైలు భూ భద్రత కోసమే భూ భారతి

## గతంలో బోగస్ పాస్ పుస్తకాలతో రైతుభరోసా స్వాహా

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

ఖమ్మం,ఆగస్ట్20: గత ప్రభుత్వ హయాంలో భూమి లేకపోయినా బోగస్ పాస్‌పుస్తకాలు సృష్టించి రైతుబంధు నిధులు స్వాహా చేసిన ఘటనలు ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా రైతులకు భద్రత కల్పించడమే లక్ష్యంగా భూ భారతి ద్వారా సర్వే చేపడుతున్నామని స్పష్టం చేశారు. రైతుల భూములకు భద్రత కల్పించడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే భూ భారతి సర్వే ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు.ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో భూ రీ-సర్వేపై నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని మొత్తం ఏడు గ్రామాల్లో భూ భారతి కార్యక్రమం కింద భూ సర్వే ప్రారంభమైనట్లు మంత్రి తెలిపారు. గతొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 70 గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామని, ప్రతి ఆరు నెలలకు 70 గ్రామాల చొప్పున సర్వే కొనసాగించి ఏడాదిన్నర కాలంలో పక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. సర్వే పక్రియలో రెవెన్యూ అధికారులు నిరంతరం కష్టపడుతున్నారని.. పూర్తయిన భూ వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. భూ భారతి చట్టాన్ని రైతులకు ఉపయోగపడేలా రూపొందించామని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ధరణి వ్యవస్థలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నేతలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని, వాటికి స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. రంగులు వేరైనా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటేనంటూ రెండు పార్టీల మధ్య ఉన్న రాజకీయ బంధాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.



# ఆర్.డీ.ఓ ఆదేశాలనూ పట్టించుకోని శేరిలింగంపల్లి తహసీల్దార్..?

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ స్టేట్ బ్యూరో:** విచారణ అనంతరం 05-08-2026 తేదీన జారీ చేసిన ప్రొసీడింగ్స్‌లో, సంబంధిత పీఐఓ/నాయబ్ తహసీల్దార్ కార్యాలయం రికార్డులను మరోసారి పరిశీలించి, 15 రోజుల్లో పాయింట్ వారీగా సమాచారం అందించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. అయితే ఆ గడువు పూర్తయి నప్పటికీ ఇప్పటివరకు పూర్తి పాయింట్ వారీ సమాచారం అందలేదని దరఖాస్తుదారు చెబుతు న్నారు.

### 1955 నుంచి 2016 వరకు మాత్రమే పహాణీలు ఎందుకు?


ఈ వ్యవహారంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి 1955 నుంచి 2016 వరకు ఉన్న పహాణి రికార్డులు మాత్రమే అందించినట్లు సమాచారం. అయితే దరఖాస్తులో కోరిన మిగిలిన సమాచారంపై స్పష్టమైన పాయింట్ వారీ సమాధానం ఇవ్వలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో అసలు రికార్డులు ఏమంటున్నాయి..? ఇంకా అందుబాటులో ఉన్న భూ రికార్డులు ఏంటి..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### 'కనెక్టెడ్ ఫైల్ నంబర్' ఎవరి బాధ్యత?

మరో ఆసక్తికర అంశం కనెక్టెడ్ ఫైల్ నంబర్. సంబంధి,త కార్యాలయ ఎండార్స్‌మెంట్‌లో కనెక్టెడ్ ఫైల్ నంబర్ లేకపోవడంతో సమాచారం అందించలేమని, దానిని దరఖాస్తుదారుడు అందించాలని కోరినట్లు తెలు స్తోంది. అయితే ఒక ప్రభుత్వ కార్యాలయంలో నిర్వహించే అంతర్గత ఫైల్ నంబర్‌ను గుర్తించి అందించాల్సిన బాధ్యత ఎవరిది..? రికార్డులను నిర్వహిస్తున్న అధికారులదా..? లేక సమాచారాన్ని కోరుతున్న సాధారణ పౌరుడిదా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ఆ సర్వే నంబర్‌పై ఎందుకింత మౌనం..?

సర్వే నంబర్ 27/1కు సంబంధించిన పూర్తి భూ చరిత్ర, పహాణి రికార్డులు, రెవెన్యూ రికార్డులు, సంబంధిత ఫైళ్లు, ఇతర అనుబంధ రికార్డులపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వ భూమికి సంబంధించిన అంశం అయితే దాని స్థితిగతులపై అధికారిక రికార్డుల ఆధారంగా స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో, ఆ భూమిలో ప్రైవేట్ కమర్షియల్ నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు



PROCEEDINGS OF THE PUBLIC INFORMATION OFFICER & REVENUE DIVISIONAL OFFICER, RAJENDRANAGAR DIVISION, RANGA REDDY DISTRICT.

PRESENT: D. SRIDHAR

Proc.No.RTI/Appeal/49/2025 Date:05.08.2026.

Sub:- RTI Act, 2005 – R.R.Dist. – Rajendranagar Division – 1st Appeal Filed by A/o. Sri Peraboina Anjaneyulu R/o.Saroornagar, Hyderabad – Request to furnish the information – Reg.

Ref:- 1st Appeal A/o. Sri Peraboina Anjaneyulu R/o.Saroornagar, Hyderabad, dt:10.07.2026 (Received on 13.07.2026)

-oOo-

ORDER:-

This is an appeal filed U/s.19(1) of RTI Act, 2005 by Sri Peraboina Anjaneyulu R/o.Saroornagar, Hyderabad, against the PIO & Naib Tahsildar, Serilingampally Mandal, for non-furnishing of the requested information on his representation dated 08.06.2026.

Accordingly, the case was taken up for hearing on 04.08.2026. On the said date, the appellant was present. On behalf of the Public Information Officer/Naib Tahsildar, Serilingampally Mandal, Sri Subbarao, Junior Assistant, appeared and submitted a copy of the endorsement bearing No. RTI/C/03/2026-193, dated 25.07.2026, issued to the appellant. The appellant also submitted a written statement stating that the information sought had not been furnished point-wise.

Hence, the PIO/N.T, O/o.the DC & Tahsildar, Serilingampally is hereby directed to once again verify the records and furnish point wise information to the appellant within (15) days in accordance with the provisions of the Right to Information Act, 2005.

Appellate Authority
Revenue Divisional Officer
Rajendranagar Division, R.R.Dist.

To:
1. The PIO & Naib Tahsildar, Serilingampally Mandal, R.R. Dist.
2. Sri Peraboina Anjaneyulu R/o.H.No.11-5-565, Bhagya Laxmi Towers, Saroornagar, Hyderabad - 500035. Ph:7989864896.

లేదా ఇతర చర్యలు జరిగి ఉంటే, వాటి వెనుక ఉన్న అధికారిక రికార్డులు ఏమిటన్నది కూడా వెలుగులోకి రావాల్సి ఉంది.

### అధికారుల నుంచి స్పష్టత రావాల్సిందే..

ఆర్.డీ.ఓ. ఆదేశాల ప్రకారం 15 రోజుల్లో పాయింట్ వారీ సమాచారం అందించాల్సి ఉన్నప్పటికీ, సమాచారం ఇంకా పూర్తిగా అందకపోవడంపై దరఖాస్తుదారు మరోసారి అప్పీల్ అథారిటీని ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఈ మొత్తం వ్యవహా రంలో అసలు రికార్డులు ఏమంటున్నాయి..? సర్వే నంబర్ 27/1 భూమి వాస్తవ స్థితి ఏమిటి..? కనెక్టెడ్ ఫైల్ నంబర్ ఎందుకు బయటకు రావడం లేదు..? 1955--2016 పహాణీల తర్వాతి రికార్డులు ఏమయ్యాయి..? ప్రభుత్వ భూమి అయితే ప్రైవేట్ కమర్షియల్ నిర్మాణాలకు ఎలా అవకాశం ఏర్పడింది..? ఈ ప్రశ్నలకు సంబంధిత రెవెన్యూ అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి పత్రాలు, అధికారిక రికార్డులు, సంబంధిత శాఖల సమాధానాలను సేకరించి మరో కథనంలో పూర్తి వివరాలతో మీ ముందుకు తీసుకువస్తాం.

### ప్రభుత్వ భూమి అని నిర్ధారణ జరిగితే.. తర్వాత ఏం జరిగింది?

ఈ వ్యవహారంలో భూమి ప్రభుత్వ భూమిగా అధికారిక రికార్డుల్లో నిర్ధారించబడిందా..? నిర్ధారించబడితే, ఆ తర్వాత ఆ భూమిపై ప్రైవేట్ నిర్మాణాలకు సంబంధించి ఏవైనా చర్యలు జరిగాయా..? జరిగితే వాటికి ఎవరు అనుమతులు ఇచ్చారు..? సంబంధిత శాఖలు ఏం పరిశీలించాయి..? అనే ప్రశ్నలకు సమాధానాలు అవసరం. ప్రభుత్వ భూమి విషయంలో ఒకవైపు అధికారిక రికార్డులు ఒక విషయం చెబుతుంటే.. మరోవైపు అదే భూమిపై ప్రైవేట్ కమర్షియల్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వస్తే, వాటిపై రెవెన్యూ అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.



నిఘా వ్యవస్థ నిద్రిస్తే...
క్రైమ్ మిర్రర్ కాపుకాస్తుంది..

శ్రావణ మాసం... భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన కాలంగా భావించే నెల. ముఖ్యంగా శ్రావణ శుక్రవారం వచ్చిందంటే ప్రతి ఇంటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. ఉదయం నుంచే ఇళ్లను శుభ్రం చేయడం, ముగ్గులు వేయడం, పూలతో అలంకరించడం, లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించడం వంటి సంప్రదాయాలు కనిపిస్తాయి. మహిళలు ఉపవాస దీక్షలు చేస్తారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతాయి. పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా మారుతాయి. అయితే ఈ సందర్భంగా మనం ఒక్కసారి మనల్ని మనమే ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉంది.



# భక్తి పేరుతో ఆడంబరం కాదు... మనసు మార్చే అసలైన పూజ!

మన భక్తి నిజంగా మన జీవితాన్ని మార్చుతోందా? లేక పూజా కార్యక్రమాలు కేవలం ఒక ఆచారంగా, ప్రదర్శనగా మారిపోయాయా? దేవుడి ముందు గంటల తరబడి నిలబడి ప్రార్థించడం గొప్ప విషయమే. కానీ అదే వ్యక్తి బయటకు వచ్చాక అవినీతి చేస్తే... అబద్ధాలు చెబితే... బలహీనులను ఇబ్బంది పెడితే... పేదవాడి హక్కును దోచుకుంటే... ఆ పూజకు అర్థం ఏముంటుంది? దేవుడికి పూలు సమర్పించడం కన్నా, మన జీవితంలో మంచి ఆలోచనలను పెంచుకోవడం గొప్ప పూజ కాదా? ఈ రోజుల్లో భక్తి కూడా కొంతవరకు ఆడంబరానికి గురవుతోంది. ఎవరి ఇంట్లో ఎంత పెద్ద పూజ జరిగింది? ఎంత ఖర్చు పెట్టారు? ఎంతటి అలంకరణ చేశారు? అనే చర్చలు పెరుగుతున్నాయి. సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు పెట్టడం తప్పు కాదు. కానీ భక్తి కంటే ప్రచారమే ముఖ్యమైపోతే, ఆ ఆరాధన వెనుక ఉన్న అసలు భావం కనుమరుగవుతుంది.

శ్రావణ శుక్రవారం లక్ష్మీదేవిని పూజించే రోజు మాత్రమే కాదు... మన ఇంట్లో, మన సమాజంలో ఉన్న దారిద్ర్యాన్ని, బాధను తగ్గించేందుకు ఒక మంచి సంకల్పం చేసుకునే రోజు కూడా కావాలి.

లక్ష్మీదేవి అంటే కేవలం ధనం మాత్రమే కాదు. సంపదతో పాటు సంతోషం, శాంతి, ఆరోగ్యం, సౌభాగ్యం, మంచి కుటుంబ బంధాలు కూడా సంపదలే. కోట్ల రూపాయలు ఉన్నా మనశ్శాంతి లేకపోతే ఆ సంపదకు విలువ ఏమిటి? పెద్ద ఇల్లు ఉన్నా కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ లేకపోతే ఆ ఇంటికి అసలు అర్థం ఏమిటి? నేడు సమాజంలో మనం చూస్తున్న అనేక సమస్యలకు మనుషుల్లో తగ్గుతున్న మానవత్వమే ప్రధాన కారణం. డబ్బు కోసం బంధాలను మరిచిపోతున్నాం. పదవి కోసం విలువలను వదులుకుంటున్నాం. స్వార్థం కోసం స్నేహాలను త్యాగం చేస్తున్నాం. ఇలాంటి సమయంలో శ్రావణ శుక్రవారం మనకు ఒక సందేశాన్ని ఇస్తోంది---ముందు మనసును శుభ్రం చేసుకోండి, తర్వాత ఇంటిని అలంకరించండి.

పూజ చేసే చేతులు ఒక పేదవాడికి సహాయం చేస్తే... దేవుడికి సమర్పించే ప్రసాదంలో ఆకలితో ఉన్నవాడికి కూడా భాగం ఉంటే... ఉపవాసం చేసే మనిషి ఆకలి విలువను అర్థం చేసుకుంటే... నిజమైన భక్తి అక్కడే కనిపిస్తుంది. ఈ శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక చిన్న సంకల్పం చేసుకుందాం. అవినీతి చేయను... అబద్ధం చెప్పను... ఇతరులను మోసం చేయను... సాధ్యమైనంత వరకు ఒకరికి సహాయం చేస్తాను... కుటుంబంలో ప్రేమను పెంచుతాను... సమాజానికి మంచి చేసే ప్రయత్నం చేస్తాను. దేవుడికి మనం సమర్పించే పూలు కొన్ని గంటల్లో వాడిపోతాయి. కానీ మనం చేసే ఒక మంచి పని ఎన్నో సంవత్సరాలు ఇతరుల జీవితాల్లో సువాసనగా నిలుస్తుంది. కాబట్టి ఈ శ్రావణ శుక్రవారం... పూజతో పాటు ఒక మంచి మార్పుకు కూడా శ్రీకారం చుడదాం. దేవుడి ముందు చేతులు జోడించడం కంటే... మనిషి ముందు మానవత్వంతో నిలబడటమే గొప్ప భక్తి!

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 21-8-2026


# డాక్టర్లు లేరు.. వైద్యం లేదు.. జహీరాబాద్ ఏరియా ఆస్పత్రి దుస్థితి!

- జహీరాబాద్ ఏరియా ఆస్పత్రి.. పేరు గొప్పే.. వైద్యం ఎక్కడ?
- ఏరియా ఆస్పత్రి వెలవెల.. వైద్యం కోసం ప్రైవేట్ బాట!
- అవార్డుల ఆస్పత్రికి ఏమైంది?.. డాక్టర్ల కొరతతో రోగుల అవస్థలు
- డాక్టర్ల కొరతతో కుదేలైన జహీరాబాద్ ఏరియా ఆస్పత్రి
- పేరు ఏరియా ఆస్పత్రి.. వైద్యం మాత్రం అంతంతే!
- ప్రభుత్వ ఆస్పత్రి ఉందా?.. వైద్యం కోసం బయటకే పరుగులు!
- డిప్యూటేషన్లతో ఖాళీ.. రోగులకు ప్రైవేట్ ఆస్పత్రులే దిక్కు!
- జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో వైద్య సంక్షోభం
- రోగుల భరోసా ఎక్కడ?.. డాక్టర్ల కొరతతో ఏరియా ఆస్పత్రి కుదేలు




**జహీరాబాద్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 20:** జహీరాబాద్ పట్టణానికి పెద్ద దిక్కుగా ఉండాల్సిన ఏరియా ఆస్పత్రి పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందా? పేరు మాత్రం ఏరియా ఆస్పత్రి.. కానీ సరైన వైద్యులు లేక ప్రజలకు పూర్తి స్థాయి వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొందన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఆస్పత్రిపై నమ్మకంతో వచ్చే పేద రోగులకు సరైన వైద్య సేవలు అందకపోవడంతో తీవ్ర నిరాశ ఎదురవుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్లు లేకపోవడం, ఉన్న కొందరు డిప్యూటేషన్‌పై వెళ్లడం, అవసరమైన మందులు, వైద్య సేవల కోసం బయటకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొందని రోగులు వాపోతున్నారు. ఒకప్పుడు జహీరాబాద్ ఏరియా ఆస్పత్రి వైద్య సేవలకు గుర్తింపుగా ఎన్నో అవార్డులు అందుకున్న ఆస్పత్రిగా పేరు తెచ్చుకుంది. అదే ఆస్పత్రి నేడు సరైన వైద్యులు లేక వెలవెలబోతుండటంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. "ఆస్పత్రికి పోదామంటే భయం.. వెళ్తే డాక్టర్ ఉంటారో లేదో తెలియదు.. మందులు ఉంటాయో లేదో తెలియదు" అంటూ రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చికిత్స కోసం చివరకు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి రావడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో వైద్యం పొందాల్సిన ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రుల గుమ్మం తొక్కాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, డిప్యూటేషన్‌పై ఉన్న వైద్యులను తిరిగి ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి అంటే పేదల ప్రాణాలకు భరోసా కల్పించే కేంద్రంగా ఉండాలని, ప్రైవేట్ ఆస్పత్రులకు పంపించే కేంద్రంగా మారకూడదని వారు అంటున్నారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ఈ సమస్యపై ప్రభుత్వం, వైద్య శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ ప్రజలు కోరుతున్నారు.



# జీవో 97 రద్దు చేయాలి

## పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను శక్తి కింద విలీనం చేయొద్దు

### నల్ల బ్యాడ్జీలు ధరించి లెక్చరర్ల నిరసన

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 20:** సంగారెడ్డి మండలం హనుమాన్ నగర్ పాలిటెక్నిక్ కాలేజీలో లెక్చరర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 2:20 గంటల వరకు కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీమతి జానకి దేవి ఆధ్వర్యంలో 15 మంది కాలేజీ సిబ్బంది ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. 'శక్తి హఠావో.. పాలిటెక్నిక్ బచావో' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ, జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను శక్తి (యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ) కింద విలీనం చేయకూడదని కోరారు. పేద, దిగువ మధ్యతరగతి విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యను అందించడంలో పాలిటెక్నిక్ కళాశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వాటిని శక్తి కింద విలీనం చేసే ప్రతిపాదనను తెలంగాణ క్యాబినెట్ వెంటనే విరమించుకోవాలని లెక్చరర్లు డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం శక్తిని ప్రత్యేక ఉపాధి ఆధారిత నైపుణ్య కేంద్రంగా స్వతంత్రంగా నిర్వహించాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను యథాతథంగా కొనసాగిస్తూ విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

## ప్రాథమిక విద్యా సామర్థ్యాల మెరుగుదలకు ప్రత్యేక శ్రద్ధ

### గుండాల కాంప్లెక్స్ సమావేశంలో మండల విద్యాధికారి అగ్గి రాములు పిలుపు



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, క్రైమ్ మిర్రర్ :-** గుండాల మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ గుండాల పాఠశాలలో బుధవారం కాంప్లెక్స్ స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి అగ్గి రాములు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు, విద్యార్థుల ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞాన సామర్థ్యాలను మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయురాలు చంద్రకళ మాట్లాడుతూ విద్యార్థుల ప్రాథమిక విద్యా సామర్థ్యాలు మెరుగుపడాలంటే ఉపాధ్యాయులు తరగతి గదుల్లో బోధన--అభ్యసన సామగ్రిని వినియోగిస్తూ ఆసక్తికరమైన బోధన నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రాథమిక విద్యా సామర్థ్యాల సహాయక బృందం నోడల్ అధికారి రవి కిరణ్ మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు బోధన--అభ్యసన సామగ్రి, పాఠ్య ప్రణాళికలను సమర్థవంతంగా వినియోగిస్తూ విద్యార్థుల అభ్యసనాన్ని మెరుగుపరచాలని సూచించారు. సహాయక బృందం ఉపాధ్యాయులకు విద్యాపరమైన సహకారం అందించేందుకు, బోధనలో మెళకువలను తెలియజేసేందుకు పనిచేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులకు విద్యాపరంగా అవసరమైన సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల ప్రాథమిక విద్యా సామర్థ్యాల అనుసంధానం, ఉపాధ్యాయుల బోధనా విధానం, విద్యార్థుల పనిపుస్తకాల పరిశీలన, ప్రతి ఉపాధ్యాయుడి 45 నిమిషాల బోధన పరిశీలన, విద్యార్థులకు అక్కడికక్కడే సామర్థ్యాల అంచనా నిర్వహించనున్నట్లు సహాయక బృందం వెల్లడించింది. కార్యక్రమంలో సహాయక బృందం సభ్యులు వనం వెంకటేశ్వర్లు, సత్తి రెడ్డి, ఆర్పీ జంపాల రాజు, సీఆర్పీ దేవనబోయిన లింగయ్యతో పాటు కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


### రూ.47.50 లక్షలతో పాఠశాల ప్రహరీ గోడ, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన

### ఖాజిపల్లిలో రూ.13 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభం



పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి, ఆగస్టు 20: విద్యా మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తున్నట్లు పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని మంత్రికుంట, చెట్లపోతారం ప్రాంతాల్లో రూ.47.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పాఠశాల ప్రహరీ గోడ, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు గురువారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు విద్యా ప్రమాణాల పెంపునకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఖాజిపల్లి గ్రామంలో రూ.13 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను ఎమ్మెల్యే ప్రారంభించారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా ప్రజల భద్రత మరింత మెరుగుపడటంతో పాటు నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధి పనులు, సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన నిధులను కేటాయించిన కెమ్ టెక్ పరిశ్రమ యాజమాన్యానికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా స్థానిక ప్రాంతాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వంతో పాటు పరిశ్రమల సహకారంతో ప్రజలకు మరింత మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో గడ్డపోతారం మున్సిపల్ చైర్మన్ సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, మండల విద్యాశాఖ అధికారి విజయ్ కుమార్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింహ, ప్రకాష్ చారి, సురేందర్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

## శంషాబాద్--చెన్నై బుల్లెట్ రైలు పాత ప్రతిపాదనను కొనసాగించాలి: మాజీ రాష్ట్ర కార్యదర్శి కనగాల నారాయణ




**కోదాడ ఆగస్టు 20 ( క్రైమ్ మిర్రర్):** కోదాడ: శంషాబాద్ నుంచి చెన్నై వరకు ప్రతిపాదించిన బుల్లెట్ రైలు మార్గాన్ని యథావిధిగా కొనసాగించాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) డిమాండ్ చేసింది. కొంతమంది రాష్ట్ర ప్రభుత్వంలోని స్వార్థ రాజకీయ నాయకులు సొంత ప్రయోజనాల కోసం వివిధ కారణాలను చూపుతూ కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న పాత ప్రతిపాదనను మార్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఈ బుల్లెట్ రైలు మార్గాన్ని సాధించేందుకు సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఇప్పటికే ఉద్యమాలు నిర్వహిస్తున్నామని బీజేపీ నాయకులు తెలిపారు. ముఖ్యంగా కోదాడ నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా శంషాబాద్--చెన్నై బుల్లెట్ రైలు మార్గాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి, మొదట రూపొందించిన ప్రతిపాదన అమలయ్యేలా కృషి చేస్తామని బీజేపీ కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర కార్యదర్శి కనగాల నారాయణ అన్నారు. ఈ అంశంపై బీజేపీ భవిష్యత్తులో ఇచ్చే పిలుపునకు కోదాడ ప్రాంత మేధావులు, వ్యాపారులు, విద్యావేత్తలు, మహిళలు, యువత, ఉద్యోగులు, కార్మికులు సహకరించాలని ఆయన కోరారు. బుల్లెట్ రైలు మార్గం కోదాడ ప్రాంత అభివృద్ధికి, రవాణా సౌకర్యాల విస్తరణకు, వ్యాపార--వాణిజ్య రంగాల అభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# జీహెచ్ఎంసీ మంజూరు చేసిన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనాలు సీజ్...

### అక్రమ నిర్మాణాలపై జిహెచ్ఎంసి ఉక్కుపాదం......

క్రైమ్ మిర్రర్ మియాపూర్ ప్రతినిధి :సైబరాబాద్ మున్సిపాల్ కమిషనర్ సృజన మరియు డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొనసాగిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మియాపూర్ సర్కిల్ లో గురువారం అధికారులు భవనాలను సీజ్ చేశారు. మియాపూర్ ఇందిరా నగర్‌లోని ప్లాట్ నం. 5 (పార్ట్), సర్వే నం. 52లో ప్లాట్ నం. 3, సర్వే నంబర్లు 58/2 & 59/2, లో జీఎచ్ఎంసీ నుంచి మంజూరు చేసిన నిర్మాణ ప్రణాళికకు విరుద్ధంగా అదనపు అంతస్తులు, నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణం జరుగుతున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీనిపై ఏ సీ పీ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించగా, మంజూరు చేసిన ప్లాన్‌ను ఉల్లంఘించి అక్రమంగా నిర్మాణం చేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆ భవనాన్ని పూర్తిగా సీజ్ చేసి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా జీ ఎచ్ ఎం సీ అధికారులు మాట్లాడుతూ.. "నగరంలో అనుమతి లేకుండా లేదా మంజూరు చేసిన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తప్పవు. ప్రజలు కూడా అక్రమ లేఅవుట్లు, అక్రమ నిర్మాణాల్లో ప్లాట్లు,




కొనుగోలు చేయవద్దు. అలా కొనుగోలు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు" అని హెచ్చరించారు. జీఎచ్ఎంసీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే వెంటనే సమాచారం ఇవ్వాలని, సీజ్ చేసిన భవనాలను మళ్లీ తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. నగరంలో అక్రమ నిర్మాణాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ తనిఖీలు కొనసాగుతాయని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపింది.

# నిరుద్యోగ సమస్యపై జిల్లా కలెక్టరేట్ ముందు సి.పి.ఐ.యం మహా ధర్నా

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా వున్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

నిరుద్యోగ యువతకు ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగాల్లో ఉపాధి అవకాశాలు కలిపించాలి

నిరుద్యోగ సమస్యలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన జిల్లా సిపిఐయం పార్టీ

ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న ఖమ్మం జిల్లా సిపిఐయం కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విభాగాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులతో ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ఎదురుగా సిపిఐఎం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించింది. ఖమ్మం కలెక్టరేట్ ధర్నా చౌక్ లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ లలో ధర్నా ను రాష్ట్ర సిపిఐయం పార్టీ పిలుపునిచ్చిన సందర్భంగా గురువారం రోజున ధర్నా కార్యక్రమం ఖమ్మం డివిజన్ సిపిఐయం కార్యదర్శి వై విక్రమ్ అధ్యక్షతన జరిగింది. ఈ ధర్నాకార్య క్రమంలో సిపిఐయం జిల్లా కార్యదర్శి న్నూ నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ" కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉద్యోగకల్పన లో పూర్తిగా విఫలమైనవి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా 2 కోట్ల యువతకు ఉద్యోగాలిస్తామని అదే విధంగా రాష్ట్రంలో రేవంత్ సర్కారు ఏటా 2 లక్షల ఉద్యోగాలిస్తామని ఎలక్షన్ కు ముందు హామీగా యూత్ డిక్లరేషన్ ప్రకటించిందని ఇంత వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగకల్పనలో పూర్తిగా విఫలమైనాయని తెలిపారు. కేంద్రంలోని మోది ప్రభుత్వం ఉద్యోగ కల్పన అంటే రోడ్డుపై నాలుగు చక్రాల బండి పై పకోడీలు అమ్మటం కూడా ఉద్యోగ కల్పనలో భాగమే అనటం నిరుద్యోగ యువతపై వారికున్న శ్రద్ధ ఏపాటిదో అని అన్నారు. యూత్ డిక్లరేషన్ ప్రకటించి అధికారంలో వచ్చిన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం యువత పట్ల మోసపూరిత వాగ్దానంగా కనపడ్తుందన్నారు. గత ప్రభుత్వం నిర్వహించిన రిక్రూట్ మెంట్లు మరియు రాష్ట్రంలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలు మొత్తం కలిపిన 60 వేలకు మించ లేదన్నారు. ఎన్నికలకు ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాలు అదే విధంగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఖాళీలు వెంటనే భర్తీ చేయడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన తక్షణమే చేయాలన్నారు. కేంద్రంలోని మోది ప్రభుత్వం అభివృద్ధిలో భారతదేశం ఎంతో ముందుందని తప్పుడు నివేదికలతో దేశ ప్రజలను మభ్యపెడ్తుందన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువత వున్న భారతదేశంలో ప్రభుత్వ ఉద్యోగ నియామకాల మరియు కర్మాగారాల స్థాపన ద్వారా వారికి పూర్తిస్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించి దేశ అభివృద్ధికి పాటు పడాలి గాని, మాయ మాటలతో నేటియువతను ఎంతో కాలం ఈ ప్రభుత్వాలు మభ్య పెట్ట లేవని అందుకు ఉదాహరణ జంతర్ – మంతర్ మరియు అనేక రాష్ట్రాల్లో యువత పోరాటాలు చూసైనా ఆలోచనలు మారాలని హితమ చేసారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగిరావాలని నిరుద్యోగ యువతకు కొత్తగా రిక్రూట్ మెంట్స్ నిర్వహించి ఉద్యోగావకాశాలు కలిపించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేసారు. లేని పక్షంలో సిపిఐయం రాజకీయ పార్టీ ఆధ్వర్యంలో అన్ని సంఘాలను, కలిసి వచ్చే పార్టీలతో మరియు నిరుద్యోగ యువతను కలుపుకొని పెద్ద ఎత్తున దేశ వ్యాప్త ఆందోళనలు, ధర్నా ప్రదర్శనలకు చేసేందుకు కూడా వెనకాడబోమని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పోన్నం వెంకటేశ్వరరావు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాచర్ల భారతి, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం,మాదినేని రమేష్, యర్రా శ్రీనివాస్ రావు, బండి పద్మ, మరియు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్, నందిపాటి మనోహర్, దొంగల తిరుపతిరావు, జబ్బార్, రమ్య, ఎస్ కే వి ఏ మీరా,మెరుగు రమణ, భుక్యా శ్రీనివాసురావు, తాళ్లపల్లి కృష్ణ, నండ్రా ప్రసాద్, కొమ్ము శ్రీనివాస్, శీలం సత్యనారాయణ రెడ్డి, ఎస్ ఫ్ ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, యస్ ఫ్ ఐ జిల్లా అధ్యక్షులు వి.రాజు, డి వై ఫ్ ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు, నిరుద్యోగ సంఘం నాయకులు భాను, ఇతర విద్యార్థి, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## భూమిని హిందూ ధార్మిక సంస్థలకు కేటాయించాలి...

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల పట్టణంలోని భువనగిరి రోడ్డులో కల్యాణ మండపం నిర్మాణం కోసం దాతల విరాళాల సహకారంతో కొనుగోలు చేసిన భూమిని హిందూ ధార్మిక సంస్థలకు కేటాయించాలని చిట్యాల పట్టణ హిందూ బంధువుల సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సమితి ప్రతినిధులు తేరేటుపల్లి హనుమంతు, సకినాల సుధాకర్, కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, మెండె వెంకన్న , జిట్టా నరేష్ గురువారం రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాజీ ఎమ్మెల్సీ చెరుపెల్లి సీతారాములకు వినతి పత్రాన్ని అందజేశారు. కల్యాణ మండపం నిర్మాణం కోసం ప్రజలు, దాతల సహకారంతో కొనుగోలు చేసిన భూమిని ఇతర అవసరాలకు వినియోగించడం సమంజసం కాదని వారు పేర్కొన్నారు. హిందూ ధార్మిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక అవసరాలకు ఉపయోగపడేలా ఆ భూమిని సంబంధిత హిందూ ధార్మిక సంస్థలకు కేటాయించాలని కోరారు.ప్రజల సహకారంతో సమకూర్చిన భూమి ఉద్దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రజలపై ఉందన్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని భూమిని హిందూ ధార్మిక సంస్థలకు కేటాయించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ ప్రజలు కూడా ఈ అంశంలో సహకరించాలని వారు కోరారు.

## మిలాద్-ఉన్-నబీ శాంతియుతంగా జరుపుకోవాలి... !

### నిర్వాహకులు,పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసిన పహాడి షరీఫ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మిలాద్-ఉన్-నబీ పండుగ సందర్భంగా శాంతియుతంగా, ఎటువంటి అసౌకర్యం లేకుండా వేడుకలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో గురువారం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పండుగ నిర్వాహకులు, ప్రాంత పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పండుగను ప్రశాంతంగా, క్రమశిక్షణతో,ఎటువంటి అంతరాయం లేకుండా జరుపుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. పండుగను ప్రశాంతంగా పూర్తి చేసేందుకు తమ పూర్తి సహకారం ఉంటుందని నిర్వాహకులు, పెద్దలు పోలీసులకు హామీ ఇచ్చారు.

## శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన సైబరాబాద్ కమిషనర్ సృజన....



**క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి ప్రతినిధి :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో పలు అభివృద్ధి మరియు మౌలిక వసతుల పనులను గురువారం ప్రారంభించారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జోనల్ కార్యాలయాన్ని ఆధునీకరించేందులో భాగంగా ప్రవేశ ద్వారాల వద్ద కొత్త సైనేజీలు, జెండా స్థంభం, ఎంట్రన్స్ లాబీ, శానిటేషన్ విభాగం, డిప్యూటీ కమిషనర్ ఛాంబర్ మరియు సమావేశ మందిరం పునరుద్ధరణ పనులను కమిషనర్ ప్రారంభించారు.అదే సమయంలో పారిశుధ్య మరియు నిర్వహణ కార్యకలాపాలను మరింత బలోపేతం చేసేందుకు జేసీబీ 01, 05 బాబ్‌క్యాట్స్ మరియు 04 మినీ రోలర్లు ని కూడా ప్రారంభించారు. వీటితో రోడ్ల మరమ్మతులు, చెత్త తొలగింపు, డ్రైనేజీ పనులు వేగవంతమవుతాయని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని అన్నిడిప్యూటీ కమిషనర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, యు బీ డీ మరియు ఎలక్ట్రికల్ విభాగాల అధికారులు మరియు సిబ్బంది హాజరయ్యారు.ఈ సందర్భంగా కమిషనర్ సృజన మాట్లాడు తూ....కొత్తగా అభివృద్ధి చేసిన సౌకర్యాలను సక్రమంగా నిర్వహించడంతో పాటు, ప్రజలకు మున్సిపల్ సేవలను సమర్థవంతంగా అందించేందుకు పౌర మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడం, పారిశుధ్య పనులను పకడ్బందీగా చేయడం ప్రతి అధికారి బాధ్యత అని సూచించారు.

# రైల్వే సమస్యలపై గళమెత్తిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

దక్షిణ మధ్య రైల్వే జీఎంతో కీలక సమీక్ష

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో పలు అంశాలపై చర్చ

భద్రాచలం రోడ్ స్టేషన్ పేరును కొత్తగూడెం లేదా భద్రాద్రి కొత్తగూడెంగా మార్చాలని వినతి

శ్రీరాముల వారు కొలువుదీరిన భద్రాచలం వరకు రైల్వే లైన్ ను పూర్తి చేయండి



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** దక్షిణ మధ్య రైల్వే (SCR) పరిధిలోనిపార్లమెంట్ సభ్యులతో రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ గురువారం సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి హాజరై.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో పెండింగ్, ప్రస్తుతం కొనసాగుతున్న పలు కీలక రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు.

**సమస్యల పరిష్కారానికి పట్టు..**

సమావేశంలో ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ..ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైల్వే రవాణా వ్యవస్థను మెరుగుపరచడం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం తమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు.

**భూ మార్పిడి - రోడ్ల అభివృద్ధి**

భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) రైల్వే స్టేషన్ అప్రోచ్ రోడ్డు విస్తరణ కోసం ఖమ్మం స్టేషన్ వద్ద ఉన్న రాష్ట్ర ప్రభుత్వ భూమిని మార్పిడి చేసుకునే ప్రక్రియపై దృష్టి సారించాలని కోరారు.

**కొత్త రైలు మార్గాలు**

ఖమ్మం అర్బన్, పాలేరు నియోజకవర్గాల్లోని సారవంతమైన భూముల గుండా కాకుండా, ప్రత్యామ్నాయ మార్గాల్లో డోర్నకల్ – మిర్యాలగూడ రైల్వే లైన్ ప్రాజెక్టును చేపట్టాలని పునరుద్ఘాటించారు. స్టేషన్ల ఆధునీకరణ అమృత్ భారత్ పథకం కింద ఖమ్మం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించి, పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కోవిడ్ కాలంలో నిలిచిపోయిన రైళ్లను పునరుద్ధరించాలని, తడికలపుడి, మధిర వంటి ప్రాంతాల్లో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్‌లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

**భద్రాచలం రోడ్డు స్టేషన్ పేరును భద్రాద్రి కొత్తగూడెం లేదా కొత్తగూడెం స్టేషన్ గా మార్చండి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖమ్మం నుంచి కొత్తగా ఏర్పడిన నేపథ్యంలో.. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో భద్రాచలం రోడ్డు పేరిట కొనసాగుతున్న రైల్వే స్టేషన్ పేరును.. భద్రాద్రి కొత్తగూడెం స్టేషన్ లేదా కొత్తగూడెం రైల్వే స్టేషన్ గా మార్చాలని విజ్ఞప్తి చేశారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమని అక్కడి వరకు రైల్వే లైన్ లేని నేపథ్యంలో..ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం నుంచి తిరుపతికి 'భద్రాద్రి ఎక్స్‌ప్రెస్'ను కొత్తగా ప్రవేశపెట్టాల్సిన ఆవశ్యకతను వివరించారు. శ్రీరామచంద్ర మూర్తి కొలువైన భద్రాచలం వరకు రైలు మార్గాన్ని వేసి,ఆ తర్వాత దానిని ఛత్తీస్ ఘడ్, ఒడిషా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కూడలిగా రూపొందించాలని డిమాండ్ చేశారు. కారేపల్లి – గాంధీపురం ఆర్వోబీలు, అగ్రహారం అండర్‌పాస్‌లపై కారేపల్లి, గాంధీపురం ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఆర్వోబీలు, అగ్రహారం వద్ద అసంపూర్తిగా ఉన్న అండర్‌పాస్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఖమ్మం నగరంలోని కస్బాబజార్ – గాంధీచౌక్ ప్రాంతంలో వరద ముంపు సమస్యపై కూడా ప్రత్యేకంగా ప్రస్తావించిన ఎంపీ, డ్రైనేజీ వ్యవస్థను విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో రైల్వే ప్రాజెక్టులన్నీ నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రైల్వే జీఎంను ఎంపీ కోరారు.

## కామ్రేడ్ కారుపోతుల అంజన్న 31వ వర్ధంతి

### ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు



**సంస్థాన్ నారాయణపురం, క్రైమ్ మిర్రర్:-** ఉమ్మడి నల్గొండ జిల్లా తాటిపాముల గ్రామంలో జన్మించిన ప్రజా కళాకారుడు, కామ్రేడ్ కారుపోతుల అంజన్న 31వ వర్ధంతి కార్యక్రమాన్ని ప్రజానాట్యమండలి సంస్థాన్ నారాయణపురం మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు గుండు నరసింహ మాట్లాడుతూ, "కళ కోసం కాదు.. ప్రజల కోసం కళ" అనే నినాదంతో కామ్రేడ్ కారుపోతుల అంజన్న తన జీవితాన్ని ప్రజా కళకు, ప్రజా ఉద్యమాలకు అంకితం చేశారని తెలిపారు. కాలుకు గజ్జ కట్టి, భుజాన గొంగడి వేసి, చేతిలో డప్పు పట్టుకుని పల్లె పల్లెకు తిరుగుతూ పల్లె సుద్దులు, ఆటల ద్వారా ప్రజలను చైతన్యపరిచారని ఆయన గుర్తుచేశారు. ప్రజల సమస్యలను తన కళ ద్వారా సమాజం ముందుకు తీసుకువచ్చి, ప్రజల్లో మమేకమై తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన మహోన్నత ప్రజా కళాకారుడు కారుపోతుల అంజన్న అని కొనియాడారు.అనంతరం కామ్రేడ్ కారుపోతుల అంజన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, విప్లవ జోహార్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా నాయకులు, ప్రజానాట్య మండలి నాయకులు, కవులు, కళాకారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య శాఖ సొసైటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడండి

### సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో అధికారికి వినతి



**క్రైమ్ మిర్రర్,నేరేడుచర్ల :** నేరేడుచర్ల మండలం పెంచికల్ దిన్నె మత్స్య శాఖ సొసైటీ ఎన్నికలు తేదీ 27-8-2026 న జరుగబోయే సందర్భంగా గురువారం సొసైటీ సభ్యుల తరపున గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారిణి కమల కి నామినేషన్లు సమర్పించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో సొసైటీ ఏర్పాటు కాబడిన నాటి నుండి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు ప్రజస్వామ్య పద్దతిలో నిర్వహించడం మొదటిసారి అని ఎన్నికల నియమావళి ననుసరించి ప్రశాంత వాతావరణంలో జరుగుట్లుగా చూడాలని ఎన్నికల అధికారిణి కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సింగ చిన సోములు హాజరు కాగా సభ్యులు ఇంజమూరి వెంకటయ్య, సిరికొండ నాగయ్య, సిరికొండ మట్టయ్య ,యడవల్లి వెంకటకృష్ణ, సింగం సైదులు, పెండెం రాములు గౌడ్, యామగాని రాంబాబు గౌడ్ కుక్కడపు ఉషేన్ గౌడ్, నాయిని బాలకృష్ణ పెండెం నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి తాళం పగులగొట్టి దొంగతనానికి యత్నం.. నిందితుడి అరెస్ట్



**క్రైమ్ మిర్రర్ -- శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇంటి తాళం పగులగొట్టి దొంగతనానికి యత్నించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బ్లూ వుడ్స్ వెంచర్‌లోని ఓ ఇంటి తాళం పగులగొట్టేందుకు ప్రయత్నిస్తుండగా కాలనీ వాసులు అప్రమత్తమై నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఫతేనగర్, ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన వేముల నర్సింహ అలియాస్ చిమకాండ్ల నర్సింహ (36) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. మద్యం, సిగరెట్ వంటి అలవాట్లు ఉన్న నర్సింహ గతంలోనూ పలు దొంగతనం కేసుల్లో అరెస్టై జైలుకు వెళ్లినట్లు విచారణలో వెల్లడైంది. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని క్రైమ్ నంబర్ 645/2022 కేసులో అరెస్టై సంగారెడ్డి జిల్లా కంది జైలులో సుమారు మూడు నెలలు న్యాయపరమైన రిమాండ్‌లో ఉన్నాడు. అలాగే సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ క్రైమ్ నంబర్ 88/2025 కేసులో అరెస్టై సుమారు 11 నెలలు జైలులో ఉండి 04-08-2026న విడుదలయ్యాడు. జైలు నుంచి విడుదలైన అనంతరం మద్యం సేవించడంతో పాటు వ్యక్తిగత ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో తిరిగి దొంగతనానికి పాల్పడాలని నిందితుడు నిర్ణయించుకున్నట్లు పోలీసులు తెలిపారు. నగర ప్రాంతంలో దొంగతనం చేస్తే సులభంగా పట్టుబడే అవకాశం ఉందని భావించి, నగరానికి కొంత దూరంలో ఉన్న శంకర్‌పల్లిని ఎంచుకున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ క్రమంలో 19-08-2026 ఉదయం సుమారు 9 గంటలకు ఇనుప రాడ్ తీసుకుని సనత్‌నగర్‌లో రైలు ఎక్కి సుమారు 10 గంటలకు శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. అనంతరం శంకర్‌పల్లి చౌరస్తాకు వెళ్లి కల్లు సేవించినట్లు పోలీసులు తెలిపారు. ఆ తర్వాత శంకర్‌పల్లిలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ దొంగతనానికి అనువుగా ఉన్న ఇళ్లను గమనించాడు. సాయంత్రం సమయంలో బ్లూ వుడ్స్ వెంచర్‌లో గాయత్రి అనే మహిళకు చెందిన తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించాడు. చుట్టుపక్కల ఎవరూ లేరని నిర్ధారించుకుని, ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించేందుకు తన వెంట తెచ్చుకున్న సుమారు ఒక అడుగు పొడవైన ఇనుప రాడ్‌తో తాళాన్ని పగులగొట్టేందుకు ప్రయత్నించాడు. అయితే తాళం పగులగొడుతున్న సమయంలో వచ్చిన శబ్దాన్ని గమనించిన కాలనీ వాసి నరసింహారెడ్డితో పాటు ఇతరులు అక్కడికి చేరుకుని నిందితుడిని పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి అతడిని పోలీసులకు అప్పగించారు. నిందితుడి వద్ద నుంచి దొంగతనానికి ఉపయోగించిన సుమారు ఒక అడుగు పొడవు, ఒక సెంటీమీటర్ వెడల్పు గల ఇనుప రాడ్‌తో పాటు మొబైల్ ఫోన్‌ను పోలీసులు పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వస్తువులకు పంచుల సంతకాలతో కూడిన లేబుళ్లు అతికించి భద్రపరిచారు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరచగా 14 రోజుల న్యాయపరమైన రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై శంకర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ మరువలేనిది

**ఉమ్మడి కులక్చర్ల మండల పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఎల్పటి అశోక్ కుమార్**

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** భారతదేశ నిర్మాణంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ మరువలేనిదని దేశ అభివృద్ధి గురించి తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అభివృద్ధి చేశారని ఉమ్మడి కుల్కచర్ల మండల పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఎల్పటి అశోక్ కుమార్ సూచించారు. వికారాబాద్ జిల్లా చౌడకూర్ మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహం దగ్గర రాజీవ్ గాంధీ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చౌడపూర్ గ్రామ సర్పంచ్ నవీన్ కుమార్, తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్ల సంఘం అధ్యక్షులు గోపాల్ నాయక్, చౌడపూర్ మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బి రాము, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్య కుమార్, గోపాల్, లింగం, చెవ్వ యాదయ్య, రాజు, కృష్ణయ్య, సంతోష్, ఇమ్రాన్, బ్రహ్మం, కృష్ణయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కుల్కచర్ల మండల కేంద్రంలో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిఎసిఎస్ చైర్మన్ బొలుసని భీమ్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు భారత దేశంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని యువత టెక్నాలజీ పరంగా ముందుకు వెళ్లాలని సాఫ్ట్ వేర్ ను తీసుకువచ్చారని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు పడమటి అంజలయ్య, పీరంపల్లి సర్పంచ్ గడ్డం వెంకటయ్య రాంపూర్ సర్పంచ్ చెక్కల తిరుపతయ్య, చెరువు ముందలితాండ సర్పంచ్ రవీందర్ నాయక్, సంతోష్ సీతారాం, కామన్ పల్లి సర్పంచ్ మోర వెంకటయ్య, కిషన్ నాయక్, భరత్, బండవెలికిచెర్ల గ్రామ ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మండల అధ్యక్షుడు పెంటమీది వెంకటయ్య, కుల్కచర్ల మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య, బీసీ సెల్ అధ్యక్షులు మహేష్, ఘనపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జలీల్, భరత్ కుమార్, శంకర్ నాయక్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొమ్ము శ్రీను, హరినాథ్ రెడ్డి, కర్రె నర్సింలు, అమృతయ్య, దాన గళ్ళ అంజి, బర్ల నరసింహులు, వడ్డీ రాములు, రాంపూర్ లక్ష్మయ్య, నాగేష్, వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు.

## కేసుల దర్యాప్తులో నాణ్యత పెంచాలి

**పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలి**

**దేవరకొండ డీఎస్పీ, డిండి సీఐ కార్యాలయాలను వార్షికం తనిఖీ చేసిన ఎస్పీ పవార్**






**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణపై జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం దేవరకొండ డీఎస్పీ కార్యాలయం, డిండి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లోని వివిధ రికార్డులు, క్రైమ్ రికార్డులు, పరిపాలనా రికార్డులు, పెండింగ్ కేసుల ఫైల్స్‌తో పాటు కేసుల దర్యాప్తు పురోగతిని ఎస్పీ సమగ్రంగా పరిశీలించారు. ముఖ్యంగా గ్రేవ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన ఫైల్స్‌ను సవివరంగా పరిశీలించి, ఆ...

## సర్, బిఎల్ఎపై అప్రమత్తంగా ఉండాలి: పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

**బంజారాహిల్స్ శ్రీనగర్ కాలనీలో బీఆర్ఎస్ నాయకులు, బిఎల్ఎలతో కీలక సమావేశం**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి నివాసంలో రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్ పరిధికి చెందిన సర్కిల్ ఇన్‌చార్జీలు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, బిఎల్ఎలతో కీలక సమావేశం నిర్వహించారు. సమావేశానికి కార్తీక్ రెడ్డి ముఖ్యంగా హాజరై ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లలో సర్ ప్రక్రియపై నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని కార్తీక్ రెడ్డి సూచించారు. ప్రతి డివిజన్‌లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఓటు హక్కు కోల్పోయిన అర్హులైన వ్యక్తుల వివరాలను బిఎల్ఎల ద్వారా గుర్తించి, అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హత కలిగిన నిజమైన ఓటరు ఒక్కరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కార్తీక్ రెడ్డి పిలుపునిచ్చారు. సర్ ప్రక్రియపై ప్రతి డివిజన్‌లో నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, బిఎల్ఎలు క్షేత్రస్థాయిలో చురుకుగా పాల్గొని ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటివరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున సర్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, బిఎల్ఎలకు కార్తీక్ రెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, డివిజన్ అధ్యక్షులు, బిఎల్ఎలు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యనగర్ కాలనీలో పాముల బెడద..

**బెంబేలెత్తుతున్న కాలనీవాసులు**

**కాలనీలోని స్మశాన వాటికను శుభ్రం చేయాలని అధికారులకు వినతి**



గండిపేట(క్రైమ్ మిర్రర్): భాగ్యనగర్ కాలనీలో పాముల బెడదతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కాలనీలోని స్మశాన వాటిక పరిసరాలు చెట్లు, పొదలతో నిండిపోవడంతో పాములు సంచరిస్తున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో బయటకు రావాలంటేనే భయపడుతున్నామని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ భాగ్యనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పీ.ఎస్. గోపాలాచారి, ప్రధాన కార్యదర్శి విశ్వనాథం సురేందర్తో పాటు పలువురు కాలనీవాసులు డిప్యూటీ మునిసిపల్ కమిషనర్ సురేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. స్మశాన వాటిక పరిసరాల్లో పెరిగిపోయిన చెట్లు, పొదలను తొలగించి, ప్రాంతాన్ని పూర్తిగా శుభ్రం చేయడంతో పాటు పాముల బెడద నుంచి స్థానికులకు రక్షణ కల్పించాలని కోరారు. వినతిపై స్పందించిన డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్మశాన వాటిక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, పాములు సంచరించే అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. అధికారులు స్పందించి చర్యలకు ఆదేశాలు ఇవ్వడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించి, తమకు భద్రత కల్పించాలని వారు కోరుతున్నారు.

## మాదాపూర్ బీజేపీ అధ్యక్షుడిగా కే.ఆనంద్ కుమార్ నియామకం....

**పెద్దలకు కృతజ్ఞతలు, నమ్మకాన్ని నిలబెడతానని హామీ**



**క్రైమ్ మిర్రర్ మాదాపూర్ ప్రతినిధి :** మాదాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా కొండాకలా ఆనంద్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ... నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి పెద్దలకు ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కార్యకర్తలందరినీ కలుపుకొని ముందుకు వెళ్తాను. మాదాపూర్‌లో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతాను" అని తెలిపారు. పార్టీ ఇచ్చిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, యువతను, కార్యకర్తలను ముందుకు తీసుకెళ్తూ బీజేపీ భావజాలాన్ని ప్రతి ఇంటికి చేరుస్తానని ఆనంద్ కుమార్ పేర్కొన్నారు.

## రిపోర్టర్‌పై దాడి కేసులో నలుగురు అరెస్ట్..!!

**రిపోర్టర్‌పై దాడి కేసులో పోలీసుల వేగవంతమైన చర్యలు**

**నిందితులను కోర్టులో హాజరుపరిచి పరకాల జైలుకు తరలింపు**

**భౌతిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు: డీఎస్పీ**




**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ జిల్లా చిట్యాలలో ఆర్‌బీ న్యూస్ రిపోర్టర్ చిరు అలియాస్ రవీందర్‌పై ఇంట్లోకి చొరబడి దాడి చేసి, ఇంటి సామాగ్రిని ధ్వంసం చేసిన కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కైలాపూర్ గ్రామ శివారులో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు భూపాలపల్లి డీఎస్పీ ఏ. సంపత్‌రావు తెలిపారు. భూమి వివాదానికి సంబంధించిన కథనాలను రిపోర్టర్ ప్రసారం చేస్తున్నాడనే కక్షతో బొజ్జం వేణు తన అనుచరులతో కలిసి దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆగస్టు 17న రాత్రి రవీందర్ ఇంట్లోకి చొరబడి అతడిపై దాడి చేయడంతో పాటు ఇంట్లోని టీవీ, ఫ్రిజ్, గ్యాస్ స్టవ్ తదితర సామాగ్రిని ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు బొజ్జం వేణుతో పాటు మెంగని నటరాజ్, మొక్కిరాల ప్రణయ్, గోలి అఖిల్‌లను అరెస్ట్ చేశారు. నేరానికి ఉపయోగించిన తెలుపు రంగు మారుతి స్విఫ్ట్ కారును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టులో హాజరుపరిచి పరకాల జైలుకు తరలించారు. కేసులో పరారీలో ఉన్న మరో ఐదుగురు నిందితుల కోసం దర్యాప్తు కొనసాగుతోందని డీఎస్పీ తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని భౌతిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో చిట్యాల సీఐ డి. మల్లేష్, ఎస్సై పోచంపల్లి సతీష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

**క్రైమ్ మిర్రర్ -- శంకర్‌పల్లి:** భారతరత్న, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా శంకర్‌పల్లి చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మడపతి చంద్ర మౌళి, శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ చేకూర్తి గోపాల్‌రెడ్డి పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి, ఆధునిక సాంకేతికత,రాజీవ్ గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. దేశాన్ని ఆధునిక, అభివృద్ధి చెందిన భారతదేశంగా తీర్చిదిద్దేందుకు ఆయన తీసుకున్న నిర్ణయాలు నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ సర్పంచులు, మున్సిపల్, మండల కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

- గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
- విద్య ,వైద్య రంగాలలో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి
- మండల కేంద్రంలో రూ.1.43 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం
- జవహర్ జాన్‌పహాడ్ లిఫ్ట్ ప్రాజెక్ట్ పూర్తయితే 10 వేల ఎకరాలకు సాగునీరు
- ఎల్లాపురం గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా
- గుడుగుంట్ల పాలెం నుండి ఎల్లాపురం రోడ్డు విస్తరణకు శంకుస్థాపన
- సాగు, త్రాగునీరు, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం
- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





**క్రైమ్ మిర్రర్, పాలకీడు :** పాలకవీడు మండల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సాగు, తాగునీటితో పాటు రహదారులు, విద్య, వైద్య రంగాల్లో మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు.పాలకవీడు మండల కేంద్రంలో రూ.1.43 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పాలకవీడు ప్రజలపై తనకు ప్రత్యేక అభిమానం ఉందని, అందుకే మండలానికి అభివృద్ధి పనుల్లో ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.రూ.600 కోట్లతో చేపట్టిన జవహర్ జాన్‌పహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పూర్తయితే సుమారు 10 వేల ఎకరాల భూములకు సాగునీరు అందుతుందని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టుతో వ్యవసాయ రంగానికి మరింత ఊతం లభిస్తుందని చెప్పారు.

**ఇళ్ల కేటాయింపులో పారదర్శకత**

హుజూర్‌నగర్ నియోజకవర్గానికి రెండు విడతల్లో 5 వేల ఇళ్లుమంజూరయ్యాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రతి బూత్‌కు 15 ఇళ్ల చొప్పున కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇళ్లు అవసరం లేని ప్రాంతాల్లోని కోటాను అవసరం ఉన్న ప్రాంతాలకు మళ్లిస్తామని స్పష్టం చేశారు.ఎనిమిది నెలల్లో రోడ్డు పూర్తి గుడుగుంట్లపాలెం--సింగారం ఎల్లాపురం స్టేజీ వరకు 8 కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.18 కోట్లతో చేపట్టే పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. రెండు కిలోమీటర్లు సీసీ రోడ్డు, ఆరు కిలోమీటర్లు డాంబర్ డబుల్ రోడ్డుగా నిర్మించనున్నట్లు తెలిపారు. పనులను ఎనిమిది నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్లాపురం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, ఇప్పటికే రూ.3.20 కోట్లతో సబ్‌స్టేషన్ పనులు ప్రారంభించామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ పెండెం వెంకటరమణ, పంచాయతీరాజ్ ఈఈ వెంకటయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ సీతారామయ్య, పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ డీఈ రమేష్, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొనతం చిన్న వెంకటరెడ్డి, సర్పంచులు సుజాత, పెరుమాళ్ల సురేష్, తహసీల్దార్ వాజిద్ అలీ, ఎంపీడీఓ లక్ష్మి, పీహెచ్‌సీ డాక్టర్ నాగిని, మండల పార్టీ అధ్యక్షుడు ఎన్.వి.సుబ్బారావు, జిల్లా కార్యదర్శి మాలోత్ మోతిలాల్, బెల్లంకొండ నరసింహారావు, నాగిరెడ్డి, జితేందర్‌రెడ్డి, డెక్కన్ సిమెంట్ పరిశ్రమ సీఏజీఎం నాగమల్లేశ్వరరావు, సింగారం గ్రామ సర్పంచ్ భూపాల్ రెడ్డి, శేశిరెడ్డి, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన కంకర్ల వినూత్నకు ఘన సన్మానం



**క్రైమ్ మిర్రర్ -- శంకర్‌పల్లి:** అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రథమ స్థానం సాధించి శంకర్‌పల్లి ప్రాంతానికి గర్వకారణంగా నిలిచిన కంకర్ల వినూత్నను యువ శౌర్య సేన వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్ లంటు యాదవ్ ఘనంగా సన్మానించి అభినందించారు. ఆగస్టు 13న కర్ణాటక రాష్ట్రంలోని గంగావతిలో డ్రీమ్ వరల్డ్ మార్షల్ ఆర్ట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండవ అంతర్జాతీయ కరాటే పోటీల్లో శంకర్‌పల్లికి చెందిన కంకర్ల వినూత్న కటా విభాగంలో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా యువ శౌర్య సేన వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్ లంటు యాదవ్ వినూత్నను శాలువాతో ఘనంగా సన్మానించి, ట్రోఫీ మరియు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించడం ద్వారా శంకర్‌పల్లి ప్రాంతానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చారని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా రవీందర్ లంటు యాదవ్ మాట్లాడుతూ.. కరాటే నేర్చుకోవడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని అన్నారు. క్రమశిక్షణ, సమయపాలన వంటి మంచి అలవాట్లు జీవితంలో అలవడతాయని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, బాలికలకు కరాటే ఎంతో ఉపయోగకరమని, ఆపద సమయంలో తమను తాము రక్షించుకునే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు.కరాటే సాధన వల్ల శరీరంలోని ప్రతి కండరానికి మంచి వ్యాయామం లభిస్తుందని, ఏకాగ్రత మెరుగుపడటంతో పాటు శరీర దృఢత్వం పెరుగుతుందని అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి కరాటే ఎంతో దోహదపడుతుందని తెలిపారు.ప్రస్తుత సమాజంలో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవాల్సిన అవసరం ఉందని రవీందర్ లంటు యాదవ్ అన్నారు. ప్రభుత్వం మహిళల రక్షణ కోసం అనేక కార్యక్రమాలు, కఠిన చట్టాలు తీసుకొస్తున్నప్పటికీ నేరాలు పూర్తిగా ఆగడం లేదని పేర్కొన్నారు. అందువల్ల వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవాలని, తమ రక్షణ బాధ్యతను తామే తీసుకునే విధంగా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన కంకర్ల వినూత్నను పలువురు అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## దేశ అభివృద్ధి కి రాజీవ్ సేవలు వెలకట్టలేనివి



**నూతనకల్( క్రైమ్ మిర్రర్):** మండల కేంద్రంలో మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ట మల్లారెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశాభివృద్ధికి, ఆధునిక సాంకేతిక రంగానికి, విద్యా రంగానికి చేసిన సేవలు వెలకట్టలేనివి. యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, జాతీయ సమైక్యతను పెంపొందించాలని పిలుపునిచ్చారు.ఆగస్టు 20న రాజీవ్ గాంధీ జయంతిని దేశవ్యాప్తంగా సద్భావనా దివస్గా పాటిస్తూ జాతీయ సమైక్యత, సామరస్యం, సద్భావన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి అంజయ్య,దరిపెల్లి వీరన్న ఉప్పుల పాపయ్య,చురకంటి చంద్రారెడ్డి, జహంగీర్ మండల కాంగ్రెస్ నాయకులు ఇమ్మరెడ్డి మహేష్ రెడ్డి, పాల్వాయి నాగరాజు, ఇరుగు కిరణ్, జటంగి గణేష్ యాదవ్, గౌరుగంటి రామమోహనరావు, మడ్డి లింగయ్య,దేశపంగు మురళి, వేల్పుల ఉదవ్,వీరబొయిన బిగ్ బాస్, బండపల్లి చందు, అనంతుల మధు సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొల్క సైదులు యాదవ్ యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు...

## బాచుపల్లి లేఅవుట్‌లో 35 నివాస ప్లాట్ల ఈ-వేలానికి ప్రీ-బిడ్ సమావేశం




హైదరాబాద్ (క్రైమ్ మిర్రర్): బాచుపల్లి లేఅవుట్‌లోని 35 నివాస ప్లాట్ల ఈ-వేలానికి సంబంధించి హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో గురువారం ప్రీ-బిడ్ సమావేశం నిర్వహించారు. భారీ సంఖ్యలో ఆసక్తిగల బిడ్డర్లు హాజరై వేలం ప్రక్రియ, ప్లాట్ల వివరాలు, మౌలిక వసతులు, నిబంధనలు తదితర అంశాలపై అధికారులను వివరణలు కోరారు. హెచ్ఎండీఏ ఇంజినీరింగ్, ప్లానింగ్, ఎస్టేట్స్ విభాగాల అధికారులు బిడ్డర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఎంఎస్టిసి సంస్థ ప్రతినిధులు ఆన్‌లైన్ ఈ-వేలం ప్రక్రియ, రిజిస్ట్రేషన్, అర్హత, బిడ్ల సమర్పణ, బిడ్డింగ్ విధానాన్ని వివరించారు. కెపిఎంజి బృందం కూడా సమావేశంలో పాల్గొంది. బాచుపల్లి ప్రాంతంలోని ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, మౌలిక వసతులు, రవాణా అనుసంధానం వంటి అంశాలను అధికారులు వివరించారు. ఈ-వేలంలో ఆసక్తిగల వారు విస్తృతంగా పాల్గొనాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ ఆగస్టు 31, ఈ-వేలం సెప్టెంబర్ 2, హెచ్ఎండీఏ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 7416835522 ప్రీ-బిడ్ సమావేశం ద్వారా వేలం ప్రక్రియపై బిడ్డర్లకు స్పష్టత లభించడంతో పాటు, పారదర్శకంగా వేలంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

# మహాత్మా గాంధీ పార్కు పునరుద్ధరణ పనులకు శ్రీకారం







**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగి సర్కిల్ నెక్నాంపూర్ డివిజన్ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఉన్న మహాత్మా గాంధీ పార్కు పునరుద్ధరణ పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ. ప్రకాశ్ గౌడ్ శ్రీకారం చుట్టారు. పార్కు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే, స్థానిక ప్రజలకు మరింత ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో పార్కులు ప్రజల ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు ఎంతో దోహదపడతాయని అన్నారు. చిన్నారులు ఆడుకునేందుకు, మహిళలు, వృద్ధులు నడక, వ్యాయామం, విశ్రాంతి తీసుకునేందుకు అనువుగా మహాత్మా గాంధీ పార్కును ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. పార్కులో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు సౌకర్యవంతమైన వాకింగ్ ట్రాక్, వ్యాయామానికి అనువైన వసతులు, పచ్చదనం పెంపు, విశ్రాంతి ప్రదేశాలు వంటి సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పార్కు పునరుద్ధరణ పూర్తయిన అనంతరం స్థానిక ప్రజలకు మెరుగైన వాకింగ్, వ్యాయామం, ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. అల్కాపూర్ టౌన్‌షిప్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉన్న పార్కులు, బహిరంగ ప్రదేశాలను సద్వినియోగం చేసుకునేలా వాటిని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్కు పునరుద్ధరణ పనులు ప్రారంభం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతుండటం వల్ల పార్కు మరింత ఆకర్షణీయంగా మారడంతో పాటు స్థానిక కుటుంబాలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్సింగి డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి, నేక్నంపూర్ డివిజన్ అధ్యక్షులు మెరుగు జితేందర్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, మణికొండ అధ్యక్షులు శ్రీరాములు, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లక్ష్మీ శ్రీ, బాల్ రెడ్డి, ఏర్పుల కుమార్, మహమ్మద్ బషీర్, సీనియర్ నాయకులు నీలేష్, ఎర్రోళ్ల రాజు, రవికాంత్, కుమార్, నరేందర్, సావిత్రి, ప్రభావతి, శివగంగ, ఏటి ఆర్ డబ్ల్యు ఏ అసోసియేషన్ సభ్యులు, గర్వ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సిద్ధేశ్వర స్వామివారి ఆలయ సేవలకు ఘన సన్మానం

**25 ఏళ్లుగా ఆలయ సేవల్లో మడపతి నరేందర్..**

**పార్టీలకు అతీతంగా ఘనంగా సన్మానం**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శ్రీ సిద్ధేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణకు 25 సంవత్సరాలుగా అంకితభావంతో సేవలందిస్తున్న ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ మడపతి నరేందర్ను గ్రామ ప్రజలు, స్వామివారి భక్తులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. నాలుగో తరానికి చెందిన మడపతి నరేందర్ శ్రీ సిద్ధేశ్వర స్వామివారి ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి గత 25 ఏళ్లుగా స్వామివారి సేవలో కొనసాగుతున్నారు. ఈ కాలంలో ఆలయ అభివృద్ధికి విశేష కృషి చేయడంతో పాటు ఆలయ ప్రాంగణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేశారు. ఆలయ అభివృద్ధితో పాటు స్వామివారి ఆలయ వారసత్వం, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వైభవాన్ని కాపాడుతూ భక్తిశ్రద్ధలతో సేవలను కొనసాగిస్తున్నారని పలువురు కొనియాడారు. ఆయన సేవా ప్రస్థానం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

**జాతర కమిటీ ఏర్పాటు...**

2026 శ్రీ సిద్ధేశ్వర స్వామివారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు మడపతి నరేందర్ ఆధ్వర్యంలో జాతర కమిటీని ఏర్పాటు చేశారు. జాతర నిర్వహణలో కీలక బాధ్యతలను బండి శ్రీకాంత్ యాదవ్‌ను జాతర అధ్యక్షుడిగా, శివ శివారెడ్డిని ఉపాధ్యక్షుడిగా నియమించారు. జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామ ప్రజలు, కమిటీ సభ్యులు, స్వామివారి భక్తుల సమన్వయంతో కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేలా బాధ్యతలు అప్పగించారు. ఈ ఏడాది జాతరతో మడపతి నరేందర్ 25 ఏళ్ల ఆలయ సేవా ప్రస్థానం పూర్తవు తున్న సందర్భంగా ప్రత్యేకంగా సన్మానించడం జరిగింది. అదే సందర్భంగా జాతర అధ్యక్షుడు బండి శ్రీకాంత్ యాదవ్, ఉపాధ్యక్షుడు శివ శివారెడ్డిని కూడా జాతర నిర్వహణ బాధ్యతలు స్వీకరించినందుకు గౌరవపూర్వకంగా సన్మానించారు.

**పార్టీలకు అతీతంగా ఒక్కటైన గ్రామం...**

ఈ సన్మాన కార్యక్రమంలో గ్రామ ప్రజలు, స్వామివారి భక్తులు, అన్ని పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలకు అతీతంగా ఒకే వేదికపైకి వచ్చి పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీ సిద్ధేశ్వర స్వామివారి సేవలో 25 ఏళ్లుగా మడపతి నరేందర్ అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా పలువురు ప్రశంసించారు. ఆలయ అభివృద్ధికి చేసిన కృషి, సంప్రదాయాల పరిరక్షణ, భక్తి భావంతో కొనసాగిస్తున్న సేవా ప్రస్థానం ప్రశంసనీయమని పేర్కొంటూ ఆయనకు అభినందనలు తెలిపారు.



## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

గండిపేట(క్రైమ్ మిర్రర్): అతి చిన్న వయసులోనే స్వర్గీయ రాజీవ్ గాంధీ దేశ ప్రధానమంత్రి పదవిని చేపట్టి భారత రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించిన మహానేత అని రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పడమటి శ్రీధర్ రెడ్డి కొనియాడారు. గురువారం రాజీవ్ గాంధీ జయంతి పురస్కరించుకొని బుద్వేల్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ యువతకు ప్రాధాన్యం కల్పించడంతో పాటు సాంకేతిక రంగానికి పెద్దపీట వేసి దేశ ప్రగతికి పునాది వేసిందని పేర్కొన్నారు. ప్రధానిగా దేశాభివృద్ధి కోసం రాజీవ్‌గాంధీ అనేక సంస్కరణలు తీసుకువచ్చి దేశ అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు.దేశంలో ఐటీ, టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి రాజీవ్ గాంధీ పునాదులు వేశారని చెప్పారు. రాజీవ్ గాంధీ చేసిన సేవలు దేశం ఎప్పటికీ మర్చిపోదని చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. యువత రాజీవ్ గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోరని బాల్ రాజ్, మాదురి ప్రభాకర్ రెడ్డి, బద్దం శ్రీధర్ రెడ్డి, మోహన్ రావు, రగడం పల్లి శ్రవణ్ కుమార్, శ్రీకాంత్ ముదిరాజ్, సంజీవరెడ్డి, షేక్ సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమిత ప్రభుత్వ భూములపై చర్యలు తీసుకోవాలి

**సామాజిక కార్యకర్త పూనెం ప్రదీప్ కుమార్ డిమాండ్.**
**నేను నడిచేందుకు ఫుట్ పాత్ కావాలి.**
**ఫుట్ పాత్, డ్రైనేజ్ ఆక్రమణలపై చర్యలేవి..**
**శాంతినగర్ లో చెరువు భూమిని స్వాధీనం చేసుకోవాలి.**
**పరిహారంతో పాటు భూములు కూడా ఇస్తారా...**
**ఆక్రమణలకు ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమే కారణమా...**
**కళ్ళున్న కబోదుల్లా చూస్తున్న సంబంధిత అధికారులు....**
**తక్షణమే ఆక్రమణలపై కలెక్టర్ స్పందించాలి చర్యలు తీసుకోవాలి...**




**భద్రాద్రి కొత్తగూడెం ఆగష్టు 20:** భద్రాచలం పట్టణంలో ప్రభుత్వ భూములను ఎదేచ్ఛగా ఆక్రమిస్తూ అనుభవిస్తున్న ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల పరిరక్షణ సంస్థ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, సామాజిక కార్యకర్త పూనెం ప్రదీప్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ నందు గురువారం నాడు ఒక్కరోజు నిరసన నిరాహార దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలం పట్టణంలో గత కొంతకాలంగా కొంతమంది ప్రజా ప్రతినిధుల, రాజకీయ నాయకుల అనుచరులు ప్రభుత్వ భూములను యదేచ్ఛగా కబ్జా చేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నారని, అటువంటి వారికి త్వరలోనే తగిన గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు. భద్రాచలం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుండి బ్రిడ్జి సెంటర్ కి ఇరువైపులా, చర్ల రోడ్డు, కూనవరం రోడ్లకు ఇరువైపులా ప్రభుత్వం ప్రజలు నడిచేందుకు ఫుట్ పాత్ లను ఏర్పాటు చేసిందని, ప్రస్తుతం ఎక్కడా కూడా ప్రజలు నడిచే పరిస్థితి లేకుండా ఫుట్ పాత్ లు అన్ని ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారని ఆయన మండిపడ్డారు. మురగునీటి వ్యవస్థ సక్రమంగా నిర్వహణ కోసం కాలువలను ఏర్పాటు చేస్తే మురుగునీటి కాలువలను కూడా కబ్జా చేసి వాటిపై అనేక బహుళ అంతస్థుల నిర్మాణాలు చేపట్టడం దుర్మార్గమన్నారు. భద్రాచలం పట్టణంలో గతంలో అనేక చెరువులు ఉండేవని, ప్రస్తుతం చూద్దామన్న చెరువులు కనిపించే పరిస్థితి లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు నెలల క్రితం శాంతినగర్ కాలనీలో సుమారు రెండు ఎకరాల చెరువు ఉండేదని, ప్రస్తుతం దాన్ని కూడా మట్టితో పూర్తిగా పూడ్చి వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా గతంలో చెరువులు, కుంటలు, బావులు ఉండేవని అవి ప్రస్తుతం కబ్జా చేయడం వలన భూమిలో నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయి నీటి కొరత ఏర్పడుతుందని ఆయన అన్నారు. రామాలయం చుట్టుప్రక్కల ఉన్న ఇండ్లను తొలగించి కోట్లల్లో నష్టపరిహారం ఇవ్వడం జరిగిందని, నష్టపరిహారంతో పాటే అత్యంత విలువైన బ్రిడ్జి సెంటర్ నందు గల ప్రభుత్వ భూమిని కూడా వారికి రెండు సెంట్ల చొప్పున ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం సరికాదన్నారు. అసలు ఏజెన్సీ ప్రాంతంలో ఇలా గిరిజనేతరులకు ఇచ్చే అవకాశం ఉందా అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అన్ని విధాలుగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిన ప్రజా ప్రతినిధులు కాలువలపై, ప్రభుత్వ స్థలాలలో తమవారికి తమకు నచ్చిన వారికి కట్టబెట్టే విధంగా ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించాల్సిన పంచాయితీ, రెవెన్యూ యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరించడం వల్లే భూములన్నీ కబ్జాలకు గురవుతున్నాయన్నారు. ఏజెన్సీ చట్టాలను, భూములను కొంతమంది అధికారులు, గిరిజనేతరులు, ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా మార్చుకుంటూ గతంలో ప్రభుత్వ భూమిగా ఉన్న వాటిని కూడా పట్టా భూములుగా చేపించుకోవడం అధికారుల దౌర్భాగ్యానికి నిదర్శనం అన్నారు. రాజకీయ నాయకులు చెప్పింది అధికారులు పాటిస్తే భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులను ఆయన హెచ్చరించారు. తక్షణమే ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అందుకు సహకరించిన అధికారులపై కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరికొద్ది రోజుల్లో హైకోర్టును ఆశ్రయించి తగువిధంగా గుణపాఠం చెప్పే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

**సొందె వీరయ్య. గోండ్వానా సంక్షేమ పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు.**

భద్రాచలం నియోజకవర్గ వ్యాప్తంగా వందనాలు ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు, ఆదివాసి సమాజం అంటే, చట్టాలన్న ఇంత నిర్లక్ష్యమా అని ఆయన మండిపడ్డారు. అధికారులు కోయ భాషలో మాట్లాడడమే కాకుండా ఆదివాసి సమాజం బాధలను తెలుసుకొని వారి చట్టాలను కూడా అదే స్థాయిలో కాపాడేందుకు పనిచేయాలని, భాష మాట్లాడినంత మాత్రాన ఆ సమాజాన్ని ఉద్ధరించినట్లు కాదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, స్థానిక ప్రజా ప్రతినిధుల ధోరణి మార్చుకోకపోతే పెద్ద ఎత్తున మరోసారి పోరాటం చేయవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు.

**మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు.**

స్వతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలు అయినా అనేకమంది నిరుపేదలు శంకు స్థలం లేక సొంత ఇల్లు లేక అనేక ఇబ్బందులు పడుతుంటే కబ్జాదారులకు మాత్రం ఎకరాలకు, ఎకరాలు ప్రభుత్వ భూములు దొరకడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ భూములను చెరువులను కబ్జా చేస్తుంటే అధికారులు చూస్తూ ఉండడం సరికాదన్నారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను మొత్తం సేకరించి నిరుపేదలకు పంచాలని ఆయన డిమాండ్ చేశారు.

**- అల్లాడి పాలు రాజ్.**

**సామాజిక ఉద్యమకారుడు.**

అధికార ప్రతిపక్ష రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులు కొంతమంది ప్రభుత్వ భూములను వ్యతిరేక ఆక్రమించుకుంటున్నారని, అనేక ఆందోళనలు, వినతి పత్రాలు ఇచ్చిన అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని ఆయన మండిపడ్డారు. భద్రాచలంలోని ప్రభుత్వ భూములు, కాలువలు, చెరువులు, కబ్జా అవుతున్న రెవెన్యూ అధికారులు ఎందుకు చోద్యం చూస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేయాల్సి వస్తుందని, ఏజెన్సీ చట్టాల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ నిబంధనతో పని చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**అలవాల రాజా..**



## బాపూఘాట్--హైదర్‌గూడ గ్రేవ్‌యార్డు వరకు సీసీ రోడ్డు పనులకు పరిశీలన

### ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని సూచన

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** బాపూఘాట్ సమీపంలోని బ్రిడ్జి నుంచి హైదర్‌గూడ గ్రేవ్‌యార్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు గురువారం క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం చూపేలా పైప్‌లైన్ ఏర్పాటు చేసి, సీసీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, టోలిచౌకి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, మున్సిపల్ ఏఈ రోహిత్‌తో కలిసి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సాబాద విజయ్‌కుమార్, కైలా రవీందర్‌రెడ్డి, రుకేష్‌కుమార్, సాయినాథ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులు రహదారి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడం వల్ల వాహనదారులు, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు పరిశీలించారు. నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన పైప్‌లైన్ పనులను ముందుగా పూర్తి చేసి, అనంతరం సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని కోరారు. రోడ్డు పనులు చేపట్టే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలని ట్రాఫిక్ అధికారులను కోరారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పనులను సమన్వయంతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

## త్వరలో పబ్లిక్ డొమిన్లోకి మూసి డిపిఆర్

### భూములు కోల్పోతున్న వారికి అన్ని విధాలా న్యాయం

### ఎంఆర్డిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ నరసింహారెడ్డి భరోసా



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మూసి ప్రక్షాళన, గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు సంబంధించి డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ త్వరలో పబ్లిక్ డొమిన్ లో ప్రదర్శిస్తామని మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఈ. వి.నరసింహారెడ్డి వెల్లడించారు. మూసి అభివృద్ధి, సుందరీకరణ కోసం భూములు కోల్పోతున్న వారికి ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ మొదటి దశ గాంధీ సరోవర్ ప్రాజెక్టు లో భూములు కోల్పోతున్న ఉప్పరపల్లి, హైదర్గూడా రైతులు , బాధితుల తరపున కొందరు ప్రతినిధులు ఎంఆర్డిసిఎల్ కార్యాలయంలో చైర్మన్ నరసింహారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. తమకు ప్రస్తుత బహిరంగ మార్కెట్ ధరలను అనుసరించి పరిహారం భారీగా ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూమూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టు చారిత్రాత్మకమైనదని, హైదరాబాద్ అభివృద్ధిలో కీలకమైన మైలురాయి అని అన్నారు. ఈ ప్రాజెక్టు అభివృద్ధికి రైతులు స్థానిక ప్రజలు ప్రభుత్వంతో సహకరించాలని కోరారు. ఈ ప్రాజెక్టుతో మూసి నది రూపురేఖలు మారిపోతాయని అన్నారు. చట్టాన్ని అనుసరించి భూములు కోల్పోతున్నరైతులకు, వ్యక్తులకు ఆమోదయోగ్యమైన పరిహారమివ్వనున్నట్లు ఆయన భరోసా ఇచ్చారు. ఎవరికి అన్యాయం కాకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. మూసి నది అభివృద్ధికి సంబంధించిన సమగ్ర ప్రణాళిక డీటేల్ ప్రాజెక్టు రిపోర్ట్ సిద్ధమైందని, దానిని త్వరలో పబ్లిక్ డోమెన్, వెబ్ సైట్లో ఉంచనున్నట్లు నరసింహారెడ్డి తెలిపారు.

# కస్తూరిబా గాంధీ నేషనల్ మెమోరియల్ ట్రస్ట్‌ను సందర్శించిన ప్రొబేషనరీ డీఎస్పీలు

## సేవా దృక్పథంతో 112 మంది ట్రైనీ డీఎస్పీల సందర్శన 56 వేల విరాళం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** సమాజంలోని అణగారిన, ఆపన్న వర్గాల పట్ల పోలీసు అధికారుల్లో మానవతా దృక్పథం, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో భాగంగా ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలు కస్తూరిబా గాంధీ నేషనల్ మెమోరియల్ ట్రస్ట్‌ను సందర్శించారు. శిక్షణలో భాగంగా నిర్వహించిన ఈ సందర్శనలో ట్రైనీ అధికారులు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓల్డ్ ఏజ్ హోమ్, ప్రజ్వల రెస్క్యూ హోమ్, మానసిక వైకల్యంతో ఉన్న వారికి అందిస్తున్న సేవా కేంద్రాలు, మహిళలకు శిక్షణ అందించే కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. హోమ్స్‌లో నివసిస్తున్న వృద్ధులు, రక్షించబడిన మహిళలు, ప్రత్యేక సంరక్షణ అవసరమైన వారితో ట్రైనీ డీఎస్పీలు ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం, భరోసా కల్పిస్తూ పోలీసు వ్యవస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ట్రైనీ అధికారులు అందరికీ స్నాక్స్ పంపిణీ చేశారు.

**ట్రస్ట్ సేవా కార్యక్రమాలపై అవగాహన..**

ట్రస్ట్ ఇన్‌చార్జిలు మూర్తి, శ్రీనివాస్ మరియు కౌన్సిలర్లు ట్రైనీ డీఎస్పీలకు ట్రస్ట్‌లోని వివిధ విభాగాలను పరిచయం చేసి, అక్కడ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, సేవా విధానం, బాధితుల పునరావాసం తదితర అంశాలను వివరించారు. కస్తూరిబా గాంధీ నేషనల్



మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటుకు సంబంధించిన నేపథ్యాన్ని, దేశవ్యాప్తంగా 22 ప్రాంతాల్లో ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు.

**మహిళల స్వయం ఉపాధికి ప్రోత్సాహం..**

ట్రస్ట్‌లో మహిళలకు వివిధ రకాల నైపుణ్య శిక్షణలు అందిస్తూ వారిని స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహిస్తున్న కార్యక్రమాలను కూడా ట్రైనీ అధికారులు పరిశీలించారు. మహిళలు స్వయంగా తయారు చేసిన జ్యూట్ బ్యాగులను ట్రైనీ డీఎస్పీలు కొనుగోలు చేసి, వారి నైపుణ్యానికి, స్వయం ఉపాధి ప్రయత్నాలకు ప్రోత్సాహం అందించారు.

**మానవతా దృక్పథంతో 56 వేల విరాళం...**

ట్రస్ట్‌లోని వృద్ధులు, రక్షించబడిన మహిళలు, ప్రత్యేక సంరక్షణ అవసరమైన వారిని కలుసుకున్న అనంతరం వారి పరిస్థితులకు చలించిన ట్రైనీ డీఎస్పీలు తమ వంతు సామాజిక బాధ్యతగా 56,000 విరాళాన్ని అందించారు. ఈ విరాళాన్ని ట్రస్ట్ ఇన్‌చార్జి మూర్తికి ట్రైనీ అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రైనీ అధికారులు మాట్లాడుతూ, సమాజంలో వివిధ కారణాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు ప్రభుత్వ సంస్థలతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా అందిస్తున్న సేవలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం తమకు ఎంతో విలువైన అనుభవమని పేర్కొన్నారు. ఇలాంటి సందర్శనలు భవిష్యత్ పోలీసు అధికారుల్లో సానుభూతి, మానవత, సేవా భావం, సామాజిక బాధ్యత మరింత పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు.

**పోలీసు శిక్షణలో సామాజిక బాధ్యతకు ప్రాధాన్యం..**

పోలీసు అధికారుల విధులు కేవలం నేర నియంత్రణ, దర్యాప్తు, శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా, బాధితులకు అండగా నిలవడం, బలహీన వర్గాలకు రక్షణ కల్పించడం, సమాజంతో మానవీయ సంబంధాలను పెంపొందించడం కూడా ముఖ్యమని ట్రైనీ డీఎస్పీలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్శనకు అవకాశం కల్పించిన తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐపీఎస్ కు ట్రైనీ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు శిక్షణలో తరగతి గది బోధనతో పాటు సమాజంలోని వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా పరిచయం చేసే ఇలాంటి ఫీల్డ్ విజిట్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్శనలో డీఎస్పీ ఆదూరి శ్రీనివాసరావు లైజన్ ఆఫీసర్‌గా వ్యవహరించారు.

## గండిపేట వార్డు-126లో వన్ డే--వన్ వార్డు కార్యక్రమం

**ప్రజల సమస్యలపై కమిషనర్‌కు వినతులు.. సత్వర పరిష్కారానికి ఆదేశాలు**

గండిపేట(క్రైమ్ మిర్రర్): గండిపేట వార్డు-126లో వన్ డే--వన్ వార్డు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖానాపూర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వార్డు ప్రజలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులతో నేరుగా సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు యూజీడీ, తాగునీటి సరఫరా, రోడ్లు, సీసీ రోడ్లు, వర్షపు నీటి డ్రైనేజీ, చెరువులకు సంబంధించిన సమస్యలు, పారిశుద్ధ్యం, దోమల బెడద, వీధి దీపాలు, విద్యుత్, కమ్యూనిటీ సౌకర్యాలు, స్మశానవాటిక అభివృద్ధి, టౌన్ ప్లానింగ్, అనధికార నిర్మాణాలు తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు, స్థానిక ప్రతినిధులు వివరించిన సమస్యలను కమిషనర్ ఓపికగా విన్నారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రాధాన్యత క్రమంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.




ప్రజలకు సకాలంలో పరిష్కారాలు అందించడంతో పాటు వార్డులో మౌలిక వసతులు, పౌర సౌకర్యాలను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వన్ డే--వన్ వార్డు కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా మున్సిపల్ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం లభించింది. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలకు పరిష్కారం చూపేలా ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు తెలిపారు.



## అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా వేగం పెంచాలి

**అధికారులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశం**


**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి**

కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలప ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం సంబంధిత శాఖల అధికారులతో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. హౌసింగ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ట్రైబల్ పంచాయతీరాజ్ శాఖల పరిధిలో జరుగుతున్న పనుల పురోగతిని ఈ సందర్భంగా ఆయన సమీక్షించారు. సమావేశంలో ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతి, మొదటి విడతలో మంజూరైన గృహాల నిర్మాణ స్థితి, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, రెండో విడతలో మంజూరు చేయాల్సిన ఇళ్లకు సంబంధించిన అంశాలపై సవివరంగా చర్చించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. అదేవిధంగా పంచాయతీరాజ్ శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణ పనులు, కొత్త రహదారుల మంజూరు, బీటీ రోడ్ల ప్రతిపాదనలు, ఇప్పటికే మంజూరై నిర్మాణంలో ఉన్న పనుల పురోగతి తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న రహదారులకు ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఎమ్మెల్యే ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి గారు స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు జయరాం, గీత, సీత, శంకర్ నాయక్, విజయలక్ష్మి, సులోచన, సుజాత, మున్సిపల్ కమిషనర్లు రాఘవేందర్, షేక్ మొహమ్మద్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, బసవలింగం, పంచాయతీరాజ్ ఏఈలు, హౌసింగ్ ఏఈలు, డీలర్లు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ నియోజకవర్గం లో నేటి నుంచి 1,96,570 మందికి నోటీసులు

**వారిలో మ్యాపింగ్ చేయని వారు 99,396**

**పేర్లు, చిరునామాలు తప్పున్న వారు 96,676**




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మ్యాపింగ్ చేసుకోని వారు, పేర్లు తప్పులున్న 1,96,570 మందికి ఈ నెల 21 నుంచి నోటీసులు అందచేయనున్నట్లు రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఓటరు జాబితా నమోదు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో వివిధ కారణాల వల్ల ఓట్లు పోను 3,88,278 మంది ఓటర్లు మాత్రమే మిగిలారన్నారు. వారిలో మ్యాపింగ్ చేసుకోని వారు 99,396 మంది, పేర్లు, చిరునామా తప్పుకున్న వారు 96,676 మంది తో కలపి 1,96, 570 మందికి నోటీసులు అందచేస్తామన్నారు. బీ ఎల్ ఓ లు ఇంటింటికి వచ్చి నోటీసులు ఇవ్వడం జరుగుతుందని, దానికి ఓటర్లు తగిన ధృవ పత్రాలు ఇచ్చి ఓటు ను పదిల పరచు కోవాలన్నారు. ఓటర్లు నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయాలకు కృషి చేద్దాం : యేల్మెటి అమరేందర్ రెడ్డి




బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించిన కాంటెస్టెడ్ ఎమ్మెల్యే మరియు టిపిసిసి కార్యదర్శి యేల్మెటి అమరేందర్ రెడ్డి. అనంతరం కేక్ కట్ చేసి అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఆశయాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, బంగారి అశోక్, శ్రీరాములు, సుభాన్ యాదవ్, నవారు మల్లారెడ్డి, పుట్టగల జగన్, అమృత నాయుడు, వంగేటి మధుసూదన్ రెడ్డి, కృష్ణంరాజు గౌడ్, పగడాల ఉమేష్, చంద్రపాల్ రెడ్డి, రవికాంత్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, దిలీప్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యాతం కుమార్, గిరిధర్, శ్రీకాంత్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, హేమంత్ రెడ్డి, భాస్కర్, గిరి, మనీ, తిరుమలేష్, మర్రి చంద్రశేఖర్, కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిత్రపురి కాలనీలో ఘనంగా మెగా రక్తదాన శిబిరం

**మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదానం..**

**సినీ కార్మికుల సేవా స్ఫూర్తికి నిదర్శనం**

**వల్లభనేని అనిల్‌కుమార్, పీఎస్ఎన్ దొర ఆధ్వర్యంలో నిర్వహణ**






గండిపేట(క్రైమ్ మిర్రర్): సినీ కార్మికుల పక్షపాతి, మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని చిత్రపురి కాలనీలో మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. చిత్రపురి కాలనీ ఎల్ఐజీ ప్రాంతంలో వల్లభనేని అనిల్‌కుమార్, పీఎస్ఎన్ దొర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు, కళాకారులు, కార్మికులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానం చేశారు. మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజును కేవలం వేడుకగా కాకుండా సామాజిక సేవాకార్యక్రమంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, అందుకే చిరంజీవి జన్మదిన వేడుకలకు సేవా కార్యక్రమాన్ని జోడించినట్లు పేర్కొన్నారు. సినీ కార్మికుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంతెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు, చిత్రపురి కాలనీ మాజీ అధ్యక్షులు వల్లభనేని అనిల్‌కుమార్ మాట్లాడుతూ సినీ పరిశ్రమ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. చిత్రపరిశ్రమలో పనిచేసే ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మెగాస్టార్ చిరంజీవి సినీ కార్మికుల పట్ల ఎప్పటికప్పుడు ప్రత్యేకమైన అభిమానాన్ని, ఆప్యాయతను చూపించారని, ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాన్ని నిలబెట్టే గొప్ప సేవ అని, యువత రక్తదాన కార్యక్రమాల్లో మరింతగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. పీఎస్ఎన్ దొర ఆధ్వర్యంలో సేవా కార్యక్రమంచిత్రపురి కాలనీ, ఫిల్మ్ ఫెడరేషన్ మాజీ సెక్రటరీ పీఎస్ఎన్ దొర మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరానికి సినీ రంగానికి చెందిన వారు, అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో స్పందించడం అభినందనీయమన్నారు. రక్తం కృత్రిమంగా తయారు చేయలేమని, ఒక వ్యక్తి రక్తదానం చేస్తే అది అవసరమైన సమయంలో పలువురికి ఉపయోగపడుతుందని తెలిపారు. ముఖ్యంగా యువతలో రక్తదానంపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలుదోహదపడతాయని పేర్కొన్నారు. సినీ ప్రముఖుల సందడిఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు హీరో శ్రీకాంత్‌తో పాటు సినీ రంగానికి చెందిన ప్రముఖులు హాజరై రక్తదాతలను అభినందించారు. అలాగే చిరంజీవి కుటుంబానికి చెందిన సుస్మిత, నిహారిక తదితరులు కార్యక్రమంలో పాల్గొని సేవా కార్యక్రమానికి తమ మద్దతు తెలిపారు. సినీ ప్రముఖుల రాకతో చిత్రపురి కాలనీలో సందడి నెలకొంది. రక్తదానం చేస్తున్న ప్రతి ఒక్కరిని నిర్వాహకులు అభినందిస్తూ, సమాజ సేవలో ముందుండాలని కోరారు. రక్తదాతలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిస్థితులను పరిశీలించిన అనంతరం రక్తసేకరణ చేపట్టారు. అభిమానుల నుంచి విశేష స్పందనమెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరానికి అభిమానుల నుంచి విశేష స్పందన లభించింది. చిరంజీవిపై ఉన్న అభిమానాన్ని సామాజిక సేవగా మలచుకోవడం సంతోషంగా ఉందని పలువురు రక్తదాతలు తెలిపారు. చిరంజీవి పుట్టినరోజు వేడుకలు అంటే కేవలం కేక్ కటింగ్, సంబరాలకే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మరింత అర్థవంతంగా మారుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

**సేవా కార్యక్రమాలకు చిత్రపురి కాలనీ వేదిక...**

సినీ పరిశ్రమకు చెందిన వేలాది మంది కార్మికులు, కళాకారులకు చిత్రపురి కాలనీ ఒక ముఖ్యమైన నివాస ప్రాంతంగా ఉంది. ఇక్కడ సామాజిక, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సినీ కార్మికుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేయవచ్చని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులోనూ రక్తదాన శిబిరాలు, ఆరోగ్య శిబిరాలు, విద్యా సహాయం, పేదలకు అండగా నిలిచే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని వారు తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ మెగా రక్తదాన శిబిరం సినీ పరిశ్రమలో సేవా స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు. సినీ కార్మికుల సంక్షేమం, సమాజ సేవ, మానవతా విలువలను ముందుకు తీసుకెళ్లే కార్యక్రమాలకు ఎల్లప్పుడూ తమ సహకారం ఉంటుందని వల్లభనేని అనిల్‌కుమార్, పీఎస్ఎన్ దొర తెలిపారు.

## జన్మదిన వేడుకల్లో సేవా స్ఫూర్తి.. ఆలయాల అభివృద్ధికి రూ.12 లక్షల విరాళం

**కుమారుడు రాధాకృష్ణ జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం చేపట్టిన దశరథ్ నాయక్**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్):** కడ్తాల్ మాజీ జడ్పీటీసీ, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆడంబరాలకు దూరంగా జన్మదిన వేడుకలను నిర్వహిస్తూ, తన దివంగత కుమారుడు రాధాకృష్ణ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కడ్తాల్ మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మిస్తున్న దేవాలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులకు రూ.12 లక్షల భారీ విరాళాన్ని అందజేశారు. కడ్తాల్ మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చేతుల మీదుగా ఈ విరాళాన్ని ఆలయాల ప్రతినిధులకు అందజేశారు. ఆలయాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు, పునర్నిర్మాణం తదితర కార్యక్రమాలకు ఈ నిధులను వినియోగించనున్నట్లు తెలిపారు.

**కుమారుడి జ్ఞాపకార్థం.. ఆధ్యాత్మిక సేవకు అంకితం**

తన దివంగత కుమారుడు రాధాకృష్ణ జ్ఞాపకాలను పదిలం చేస్తూ, ఆయన పేరిట ఏర్పాటు చేసిన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దశరథ్ నాయక్ నిరంతరం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తన జన్మదినాన్ని కూడా సేవా కార్యక్రమాలకు అంకితం చేయడం పట్ల పలువురు అభినందించారు. పుత్రశోకాన్ని గుండెల్లో దాచుకుని, రాధాకృష్ణ జ్ఞాపకాలను ప్రజాసేవతో ముడిపెట్టి ముందుకు సాగుతున్న దశరథ్ నాయక్, తన జన్మదినం సందర్భంగా ఆలయాల అభివృద్ధికి రూ.12 లక్షలు విరాళంగా అందించడం ఆయన సేవా స్ఫూర్తికి, దైవభక్తికి నిదర్శనమని పలువురు పేర్కొన్నారు.

**ప్రముఖుల శుభాకాంక్షలు....**

దశరథ్ నాయక్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచే కడ్తాల్ మండల కేంద్రానికి అభిమానులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం తదితర ప్రముఖులు దశరథ్ నాయక్‌ను శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దశరథ్ నాయక్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని వారు ఆకాంక్షించారు.

**నియోజకవర్గ వ్యాప్తంగా ప్రశంసలు..**

జన్మదిన వేడుకలను కేవలం కేక్ కటింగ్, సన్మానాలకే పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాన్ని చేపట్టి, దేవాలయాల అభివృద్ధికి రూ.12 లక్షల విరాళం అందించడం పట్ల భక్తులు, అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధులతో మండలంలోని పలు ఆలయాలకు మరింత పూర్వవైభవం తీసుకురావడానికి అవకాశం ఏర్పడుతుందని ఆలయ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు, మాజీ చైర్మన్లు, మాజీ ఎంపీపీలు, మాజీ వైస్ ఎంపీపీలు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఉపసర్పంచులు, టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, దశరథ్ నాయక్ అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి.. పోలీసుల తీరుపై బాధితుల ఆగ్రహం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందడంతో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్దతూప్రా గ్రామంలో విషాదం నెలకొంది. ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై పోలీసులు సకాలంలో చర్యలు తీసుకోవడం లేదంటూ మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. పెద్దతూప్రా గ్రామానికి చెందిన సాయి గౌడ్ మూడు రోజుల క్రితం కొత్తూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా వేగంగా వచ్చిన ఓ కారు అతని ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో సాయి గౌడ్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే తొండుపల్లిలోని లీమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ గురువారం ఉదయం సాయి గౌడ్ మృతి చెందాడు. ప్రమాదం అనంతరం కారు అక్కడే వదిలి నిందితుడు పరారైనట్లు బాధితులు ఆరోపించారు. ప్రమాదానికి కారణమైన కారు నడిపిన వ్యక్తి మాజీ ప్రజాప్రతినిధి కుమారుడని, అతను మైనర్ అని తమకు తెలిసిందని పేర్కొన్నారు. ఈ కారణంగానే అధికారుల ఒత్తిళ్లతో పోలీసులు కేసు నమోదు, తదుపరి చర్యల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపించారు. సాయి గౌడ్ మృతితో తీవ్ర ఆవేదనకు గురైన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆస్పత్రి వద్ద పెద్ద సంఖ్యలో చేరుకుని ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అయితే బాధితులు పోలీసుల హామీలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి సంబంధించి పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం, గ్రామస్తులు కోరుతున్నారు.

## గ్రామ సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌కు వినతి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ గ్రామ పర్యటన సందర్భంగా గ్రామ కార్యదర్శులతో కలిసి స్థానిక ప్రజల ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అన్ని పార్టీల నాయకుల సమక్షంలో గ్రామంలో నెలకొన్న సమస్యలను వివరించి, వాటికి తక్షణ పరిష్కారం చూపాలని కోరారు. గ్రామంలోని సుమారు 60 శాతం ప్రాంతంలో మురుగు పేరుకుపోవడంతో దోమల బెడద తీవ్రంగా మారిందని తెలిపారు. దీంతో ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారని వివరించారు. గతంలో మురుగునీటి పారుదల కోసం పైపులైన్ ఏర్పాటు చేస్తామని, బడ్జెట్ కూడా కేటాయించామని చెప్పినా పనులు నిలిచిపోయాయని గుర్తుచేశారు. వెంటనే పైపులైన్ పనులు చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సూర్యవనికుంట, సోనుకుంటల్లో సమస్య: సూర్యవనికుంట, సోనుకుంట ప్రాంతాల్లో మురుగునీరు పేరుకుపోయి దుర్వాసన, దోమల సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. మురుగునీటి ప్రవాహానికి సరైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి, నీరు బుల్కాపూర్ నాలాలోకి వెళ్లేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. 2019 నుంచి నీటి బిల్లులు వస్తున్నప్పటికీ రోడ్డుకు అవతల ప్రాంతంలో తాగునీటి సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. నీటి సరఫరా లేని ప్రాంతాలకు వస్తున్న బిల్లులను తొలగించాలని, ముందుగా నీటి సమస్యను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. మున్సిపల్ పన్నులపై పెనాల్టీలు విధించడంతో ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. పన్నుల విషయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. గ్రామంలోని సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కార చర్యలు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు


Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.